మనసున
మమతని నింపుకున్న
ప్రతీ సోదరికి ...
ఆ సోదరిని సర్వంగా భావించే ప్రతీ
సోదరునికి
"రక్షా బంధన్"
శుభాకాంక్షలు

www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 184 | శుక్రవారం 28.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-




# ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్..

## 5-15 ఏళ్ల పిల్లలకు టాలెంట్ హంట్

ప్రతిభకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ

భారత్ పతకాల సంఖ్య పెంచడమే లక్ష్యం

**2036 ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడా రంగంలో సమూల మార్పులు**

- 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడా రంగంలో సమూల మార్పులు
- భారత్ ప్రాతినిధ్యం లేని క్రీడల్లోనూ పతకాల వేట మొదలుపెట్టాలి
- ప్రతి జిల్లాలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా క్రీడా వ్యవస్థ అభివృద్ధి
- యువ అథ్లెట్లకు క్వాలిఫికేషన్ నుంచి పతకాల వరకు కేంద్రం అండ
- సర్ఫింగ్, క్లైంబింగ్ వంటి క్రీడల్లో భారత ప్రతిభను వెలికితీయాలి
- చిన్న వయసులోనే ప్రతిభను గుర్తించి ఒలింపిక్స్‌కు సిద్ధం చేయాలి

03



# పెరుగుతున్న మరణాల సంఖ్య

గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు

భారతీయుల ఆచూకీపై కేంద్రం ప్రత్యేక దృష్టి

- నేపాల్‌లో మృతుల సంఖ్య 175కు చేరిక
- 826 మంది ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం
- 300 మందికి పైగా భారతీయులపై ఆందోళన
- కైలాస్ యాత్రికులతో తెగిపోయిన సంబంధాలు
- ఈషా ఫౌండేషన్ బృందం పరిస్థితిపై ఉత్కంఠ
- హెలికాప్టర్లు, డ్రోన్లతో రెస్క్యూ ఆపరేషన్

05

# మీరాలం ట్యాంక్‌పై

## వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్లు , డెస్టినేషన్ వెడ్డింగ్స్!



# సీఎం ఫోకస్

## హైదరాబాద్‌లో కొత్త టూరిజం హబ్

- మిర్ ఆలం చెరువు అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి
- అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మిర్ ఆలం చెరువు
- సస్పెన్షన్ బ్రిడ్జి పనులు వేగవంతం.. 50 శాతానికి పైగా పురోగతి
- బోటింగ్, వాటర్ స్పోర్ట్స్‌తో సందర్శకులకు సరికొత్త అనుభూతి
- ఐలాండ్లను గ్లాంపింగ్, వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలంగా అభివృద్ధి
- మురుగునీరు చేరకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశం
- నాలాల విస్తరణతో చెరువు నీటి నాణ్యత పెంపునకు చర్యలు
- ఫుడ్‌కోర్టులు, పార్కులు, వాకింగ్ ట్రాక్‌లతో ప్రత్యేక ఆకర్షణ

02



# మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



- విలీన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం
- ఖమ్మం కార్పొరేషన్‌లో రూ.2.12 కోట్ల పనులకు శంకుస్థాపన
- పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్న మంత్రి పొంగులేటి
- మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధుల కేటాయింపు
- అర్హులైన పేదలకు దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు
- అభివృద్ధి పనుల్లో నాణ్యతపై రాజీ వద్దని కలెక్టర్ ఆదేశం
- రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులు దశలవారీగా కేటాయింపు
- ప్రతి హామీని అమలు చేస్తామన్న మంత్రి పొంగులేటి

03

# రూ. 200 కోట్లతో జీవో జారీ



ఆటో డ్రైవర్లకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్

ఎలక్ట్రిక్ ఆటోలకు రూ.1.50 లక్షల సబ్సిడీ

18,766 ఆటోలను ఈవీలుగా మార్చేందుకు నిర్ణయం

కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం కీలక చర్యలు

ఆటో కార్మికులకు ఇంధన ఖర్చుల నుంచి ఊరట

ఈవీ ఆటోల వైపు తెలంగాణ ప్రభుత్వం అడుగులు

03

# యశోద ఆస్పత్రిలో గవర్నర్ ను పరామర్శించిన సీఎం

గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సీఎం సుదీర్ఘ చర్చ

త్వరగా కోలుకుని విధుల్లోకి రావాలని సీఎం ఆకాంక్ష



# ముగ్గురి ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు!

## ఏడుగురిలో నలుగురు సురక్షితం..

- నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రికులపై లోకేష్ సమీక్ష
- ఏడుగురిలో నలుగురు సురక్షితం.. ముగ్గురి ఆచూకీ గల్లంతు
- ఆచూకీ కోసం కేంద్రంతో నిరంతరం సమన్వయం
- చైనా, నేపాల్ అధికారులతో సంప్రదింపులు కొనసాగింపు
- సురక్షిత యాత్రికులను త్వరగా తరలించాలని లోకేష్ ఆదేశం
- ముగ్గురి జాడ కోసం ప్రత్యేకంగా చర్యలు
- యాత్రికుల భద్రతపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

03





# హరీష్ రావు అరెస్ట్

టీఎన్జీఓల ధర్నాకు హరీశ్ రావు సంఘీభావం

- హన్మకొండలో ఉద్రిక్తత.. హరీశ్ రావు అరెస్ట్
- విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా వెళ్లిన మాజీ మంత్రి
- హరీశ్ రావు అరెస్ట్‌పై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం
- పోలీసుల తీరుపై మాజీ మంత్రి తీవ్ర అసహనం

03

# బీఆర్ఎస్ పార్టీని లాక్కునేందుకు కుట్ర




- హరీశ్ రావుపై కవిత సంచలన ఆరోపణలు
- కేసీఆర్‌కు వెన్నుపోటు కుట్ర చేస్తున్నారంటూ విమర్శలు
- బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ
- హరీశ్ రావుకు బీజేపీతో మిలాఖత్ ఉందన్న కవిత
- రేవంత్ రెడ్డి, హరీశ్ రావు భేటీపై కవిత కీలక వ్యాఖ్యలు

02

## తెలంగాణలో జనగణనకు లైన్ క్లియర్..

జనగణన-2027కు తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

రాష్ట్ర గెజిట్‌లో కేంద్ర నోటిఫికేషన్ పునఃప్రచురణకు ఆదేశాలు

జనాభా లెక్కల్లో 40 రకాల వివరాల సేకరణ

03



## నకిలీ వైద్యుల ఉచ్చులో పడకండి

నకిలీ వైద్యులపై సీపీ సజ్జనార్ హెచ్చరిక12 మంది నకిలీ వైద్యులపై పోలీసుల కఠిన చర్యలుఅర్హత లేకుండానే వైద్యం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలినకిలీ వైద్యుల చికిత్సతో అవయవాలకు ముప్పు

02



# బీఆర్ఎస్ పార్టీని లాక్కునేందుకు కుట్ర

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు, కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్ రావు కుట్రలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. గురువారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇటీవలే మెదక్ ఎమ్మెల్యేలతో హరీశ్ రావు మీటింగ్ పెట్టారని ఈ మీటింగ్‌లో కేసీఆర్ ఎన్టీఆర్‌లా పెద్ద మనిషి. కానీ ఆయన కొడుకు వార-సత్వం ఇవ్వడం సరికాదని హరీశ్ రావు అన్నట్లు ఆ మీటింగ్‌లో ఉన్న ఒక ఎమ్మెల్యేనే నాకు ఈ విషయం చెప్పారని కవిత ఆరోపించారు. ఎన్టీఆర్ పేరు తీసుకున్నారంటే గుంటనక్క వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైందని హరీశ్ రావును ఉద్దేశించి ఘాటు విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తన హస్తగతం చేసుకొని ఆ తర్వాత బీజేపీ సపోర్ట్ తీసుకోవాలని కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. బీజేపీతో హరీశ్ రావు మిలాఖత్ ఉందని చెప్పటానికి నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయన్నారు.

**ఆర్ఎస్ఎస్ ప్రముఖుడితో మంతనాలు:**

రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్‌లో ఒక ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు వచ్చినప్పుడల్లా ఆయనకు పసుపు, మిరియాలు కలిపిన పాలు వెళ్తుంటాయని ఆ రోజు హరీశ్ రావు పూర్తిగా తన కార్యక్రమాలను రద్దు చేసుకోని ఆయనతో మీటింగ్ పెడతారని కవిత ఆరోపించారు. తాను ఇప్పుడు బీఆర్ఎస్‌లో లేనని ఆ పార్టీ ఎలా పోయినా నాకు సంబంధం లేదు. కానీ తిన్నింటి వాసాలు లెక్కపెట్టే గుంటనక్క గురించి తెలియాలని ఈ విషయాలన్నీ చెబుతున్నానన్నారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రితో కచ్చితంగా హరీశ్ రావుకు లాలూచీ ఉందన్నారు. అందువల్లే తెలంగాణ ప్రయోజనాలను ముఖ్యమంత్రి తాకట్టు పెడుతున్నప్పటికీ బీఆర్ఎస్ మాట్లాడటం లేదని విమర్శించారు. కొద్ది రోజుల క్రితమే లండన్‌లో సీఎంరేవంత్ రెడ్డి, హరీశ్ రావు మధ్య మీటింగ్ జరిగిందన్నారు. నిజంగా లండన్‌లో ఈ ఇద్దరి మధ్య లాలూచీ లేకపోతే హరీశ్ రావుపై క్విడ్ ప్రో కో కేసు నమోదు చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఇక ఆంధ్రావాళ్లతో కేటీఆర్‌కు వ్యాపార సంబంధాలు, దోస్తులు ఉండటంతో ఆయన మాట్లాడటం లేదని కవిత ఆరోపించారు.

**మంత్రిగా ఉంటూ ఆంధ్రావాళ్లతో వ్యాపారం:**

ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హరీశ్ రావు కార్పొరేట్ సంస్థలతో పాల వ్యాపారం చేశారని ఒక్క నారాయణ, చైతన్య కాలేజ్ లకే నెలకు 5 కోట్ల చొప్పున 8 ఏళ్లుగా 960 కోట్ల వ్యాపారం చేశారని ఆరోపించారు. ఇంకా కార్పొరేట్ హాస్పిటల్స్ కిమ్, కామినేని, యశోద వంటి హాస్పిటల్స్ తోనూ పాల వ్యాపారం చేశారుఅన్నారు ఆరోగ్య శాఖ మంత్రిగా ఉంటూ ఇలా ఆంధ్రావాళ్లతో పాల వ్యాపారం చేయటం క్విడ్ ప్రో కో కాదా? అని ప్రశ్నించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ వ్యవస్థీకృత అవినీతికి పాల్పడిందని, పాల వ్యాపారం ఒకరికి, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒకరికి, ఇసుక వ్యాపారం ఒకరికి అన్నట్లు పంచుకొని దోచుకున్నారని ఆరోపించారు.

**ఆంధ్రా హీరో భార్యకు యాదాద్రి బోర్డు మెంబరా?**

రేవంత్ రెడ్డి అంటే అనుముల రేవంత్ రెడ్డి కాదు ఆంధ్రా రేవంత్ రెడ్డి అని విమర్శించారు. బ్రహ్మణ పరిషత్‌లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఆంధ్రా వాళ్లకు ఇచ్చారు. అంటే తెలంగాణలో బ్రహ్మణ మేధావులు లేరా? పొలిటికల్ పదవులు కచ్చితంగా తెలంగాణ వాళ్లకే ఇవ్వాలన్నారు. ఇప్పుడున్న బ్రహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాసరావు పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని తెలంగాణ ఉద్యమ సమ-యంలో తెలంగాణ వాదులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని గుర్తుచేశారు. పేద బ్రాహ్మణులకు మేలు చేయాల్సిన తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆంధ్రా రౌడీలకు అడ్డాగా మారిందని దళిత మహిళలను, తెలంగాణ వాళ్లను బసవరాజు శ్రీనివాసరావు ఇష్టమొచ్చినట్లు తిట్టాడని ఆరోపించారు. వెంటనే ఆంధ్రా వాళ్లకు ఇచ్చిన చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తొలగించి తెలంగాణ వాళ్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భక్తుల పైసలతో కట్టిన యాదాద్రి గుడిలో మెంబర్‌గా ఆంధ్రా హీరో భార్యకు అవకాశం కల్పించారని తిరుపతి బోర్డులో మనవాళ్లకు అవకాశం కల్పించటమంటే అక్కడ మనవాళ్ల పైసలు కూడా ఉంటాయన్నారు. నిజంగా ముఖ్యమంత్రికి తెలంగాణ సోయి ఉంటే బ్రహ్మణ పరిషత్‌లో యాదాద్రి గుడి బోర్డులో ఉన్న ఆంధ్రావాళ్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

## నకిలీ వైద్యుల ఉచ్చులో పడకండి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వైద్యం పేరిట అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల పట్ల ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో కల్తీ ఆహారం పై ఉక్కుపాదం మోపిన నగర పోలీసులు, తాజాగా నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఉంచి 12 మందిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకున్నట్లు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఎలాంటి అర్హతలు, కనీస వైద్య పరిజ్ఞానం లేని వీరు అసలైన వైద్యులలా నటిస్తూ యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, బీపీ, షుగర్ మందులతో పాటు విచక్షణారహితంగా ఇంజెక్షన్లు, సెలైన్లు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరి అవగాహనారహిత చికిత్సల వల్ల ప్రజల ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని సీపీ పేర్కొన్నారు.నకిలీల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు క్లినిక్‌లు, ఆసుపత్రులకు వెళ్లినప్పుడు కొన్ని కీలక జాగ్రత్తలు పాటించాలని సీపీ సూచించారు. ఆసుపత్రుల వద్ద డీఎంహెచ్ఓ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వైద్యుల బోర్డులపై టీఎస్ఎంసీ కేటాయించిన రిజిస్ట్రేషన్ నెంబర్ ఉన్నాయో లేదో తప్పనిసరిగా సరిచూసుకోవాలన్నారు. వైద్యులపై ఏమాత్రం అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ (onlinetsmc.in) లో వివరాలను తనిఖీ చేసుకోవాలని, అవ-సరమైతే ఇతర నిపుణులైన వైద్యుల వద్ద సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని కోరారు. నకిలీ వైద్యుల సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

## యశోద ఆస్పత్రిలో గవర్నర్‌ను పరామర్శించిన సీఎం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అనారోగ్య కారణాలతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఆసుపత్రికి చేరుకుని గవర్నర్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. గవర్నర్ గదిలోకి వెళ్లిన ముఖ్యమంత్రి, ఆయన యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం గవర్నర్‌కు అందుతున్న వైద్య సేవలు, ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై చికిత్స అందిస్తున్న వైద్య బృందంతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. గవర్నర్ త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లోకి రావాలని సీఎం ఆకాంక్షించారు. ఆయనకు అత్యుత్తమ స్థాయి వైద్య సేవలు నిరంతరం అందించాలని ఆసుపత్రి యా-జమాన్యానికి, వైద్యులకు సూచించారు. గవర్నర్‌ను పరామర్శించిన వారిలో ముఖ్యమంత్రితో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. ప్రస్తుతం గవర్నర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన కోలుకుంటున్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

## మీరాలం ట్యాంక్‌పై సీఎం ఫోకస్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దబోతోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు , వినోదాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం మిర్ ఆలం చెరువును అకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు , సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన సీఎం, పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

**సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతానికి పైగా పురోగతి**

మిర్ ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 (50.18 శాతం) పైల్స్ పూర్తి కాగా, 62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు , ఐలాండ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా చెరువులోకి ఎలాంటి మురుగు నీరు చేరకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్లు , డెస్టినేషన్ వెడ్డింగ్స్!**

యువతతో పాటు కుటుంబాలను ఆకట్టుకునేలా మిర్ ఆలం చెరువులో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలను అందుబాటులోకి తేనున్నారు. పర్యావరణ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు , వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు కానున్నాయి. అంతేకాకుండా, చెరువులో ఉన్న ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లు వేసుకునే గ్లాంపింగ్ స్పాట్లుగా , డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు. ఈ నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానికులకు ఉపాధి కల్పిస్తారు.

**జూ పార్కుతో అనుసంధానం - సమగ్ర పర్యాటక అనుభూతి**

సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. దీనివల్ల జూ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు , కుటుంబ వినోదాన్ని పొందగలుగుతారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మిర్ ఆలం ట్యాంక్ ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మా-రనుంది.



## మహిళ కంటనీరు నేలపై పడితే సునామీనే..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కొండా సురేఖ ఎపిసోడ్ పై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలను తాను గౌరవిస్తానని, వారిపై తాను ఎప్పుడూ ప్రెస్ మీట్ పెట్టనని చెప్పారు. తన తల్లి తనను తిట్టినా సైలెంట్ గా అక్కడ నుండి వెళ్లిపోతానని అన్నారు. వాళ్లు తిట్టారు అని తిరిగి తిడితే మహిళలంతా మనపై రివర్స్ అవుతారని చెప్పారు. మహిళలు కన్నీళ్లు పెట్టుకుని ఒక్క చుక్క కంటనీరు భూమిపై పడినా ఆ చుక్క సునామీగా మారి ఆ సునామీలో కొట్టుకుపోతామని వ్యాఖ్యానించారు. కాబట్టి మహిళలపై తను ఎప్పుడూ ప్రెస్ మీట్ పెట్టనని అన్నారు. ఒకవేళ తనను తిట్టినా అక్షింతలుగానే తీసుకుంటానని అన్నారు.కొండాసురేఖ ఇష్యూపై ఎవరూ మాట్లాడవద్దని సీఎం రేవంత్ రెడ్డి కూడా చెప్పారన్నారు. క్రమశిక్షణ కమిటీ ఆ ఇష్యూపై విచారణ జరుపుతోందని ఏఐసీసీ నిర్ణయమైనా, పీసీసీ నిర్ణయం ఏదైనా, సీఎం నిర్ణయం ఏదైనా దానికి తాము కట్టుబడి ఉంటామన్నారు. ఎవరు తప్పు చేశారనేది దేవుడు చూస్తున్నారని, క్రమశిక్షణ కమిటీ ఎలాంటి నివేదిక ఇచ్చినా దానికి కట్టుబడి ఉంటామని చెప్పారు. అంతేకాకుండా తన నియోజకవర్గానికి రావాల్సిన నిధుల కోసం కొట్లాడతానని అన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం దీక్షలో అయినా కూర్చుంటానని చెప్పారు. అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగంతో ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు.

## 'తుమ్మిడిహట్టి'పై కదిలిన కేంద్రం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై నెలకొన్న అడ్డంకులను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు రంగంలోకి దిగింది. ఢిల్లీ లోని సెంట్రల్ వాటర్ కమిషన్ అధ్యక్షతన సెప్టెంబర్ 1న ఓ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లుగా కేంద్రం ప్రకటించింది. ఈ కీలకమైన అంతరాష్ట్ర భేటీకి సంబంధించి తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక ఆహ్వానాలు పంపింది. ఢిల్లీలో జరగనున్న ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నీటిపారుదల శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు, సాంకేతికత, ముంపు ప్రాంతాల విస్తీర్ణం, ఇతర అంతరాష్ట్ర నీటి వివాదాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి చొరవతో కదలిక..**

తెలంగాణ సాగునీటి అవసరాలకు అత్యంత కీలకమైన తుమ్మిడిహట్టి బ్యారేజీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మొదటి నుంచి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. మహారాష్ట్ర అభ్యంతరాలు, బ్యారేజీ ఎత్తుపై సమగ్ర చర్చలు జరపాలని, కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించాలని కోరుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే సీడబ్ల్యూసీకి లేఖ రాశారు. అయితే, సీఎం లేఖపై తక్షణమే స్పందించిన కేంద్ర ప్రభుత్వం, రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఈ భేటీని ఖరారు చేసింది. ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన తుమ్మిడిహట్టి ప్రాజెక్టు సమస్యకు ఈ సమావేశం ద్వారా స్పష్టమైన పరిష్కారం లభిస్తుందని అధికారులు ఆశిస్తున్నారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 1న జరగబోయే భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఆశగా ఎదురుచూస్తున్న ఉత్తర తెలంగాణ రైతాంగం..**

తెలంగాణ ప్రభుత్వం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల పరిధిలోని తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై ఈ బ్యారేజీని ప్రతిపాదించారు. కానీ, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద కాకుండా దిగువన మేడిగడ్డ వద్ద ప్రాజెక్టును చేపట్టింది. అయితే మేడిగడ్డ బ్యారేజీ వద్ద సాంకేతిక లోపాలు తలెత్తడం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఆశించిన స్థాయిలో నీరు అందకపోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎలాగైనా నిర్మించాలని పూనుకున్నది. కానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి పథకంలో భాగంగా తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మించాలని మొదట ప్లాన్ చేశారు. అయితే, 152 మీటర్ల ఎత్తు పెడితే తమ రాష్ట్రంలో ఎక్కువ భూమి మునిగిపోతుందని మహారాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎత్తును 148 మీటర్లకు తగ్గించాలని సూచించింది. ఒకవేళ తుమ్మిడిహట్టి వద్దే బ్యారేజీ నిర్మిస్తే లిఫ్ట్ అవ-సరం లేకుండా, తక్కువ విద్యుత్ ఖర్చుతో గ్రావిటీ ద్వారానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ నియోజకవర్గాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే భేటీ ద్వారా అనేక ఏళ్లుగా నిలిచిపోయిన ఈ అంతరాష్ట్ర జల వివాదానికి తెరపడి, ప్రాజెక్టు పనుల్లో వేగం పెరుగుతుందా.. అని ఉత్తర తెలంగాణ రైతాంగం ఆశగా ఎదురుచూస్తోంది.

## పొన్నం ఎందుకు స్పందించడం లేదు?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ-స్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో జాప్యంపై0 తెలంగాణ జనసేన ప్రశ్నించింది. రూ.35.19 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ కొండగట్టు అభివృద్ధి పనులు ఎందుకు ఆగిపోయాయి? సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. 96 గదుల సత్రం, దీక్షా విరమణ మండపం కోసం రు.35.19 కోట్లు టీటీడీ నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ టెండర్ ఎందుకు పిలవలేదని ప్రశ్నించింది. ఈ పనుల కోసం జనవరి 3న స్వయంగా ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొండగట్టులో పర్యటించి శంకుస్థాపన చేశారు. అయితే శంకుస్థాపన చేసి ఏడు నెలలవుతున్నా పనుల ప్రారంభంలో జాప్యంపై జనసేన నిలదీసింది. హిందూ భక్తుల సౌకర్యాలపై రాజకీయాలు



వద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది.

**పొన్నంపై ఘాటు విమర్శలు:**

ఈ సందర్భంగా మంత్రి పొన్నంపై తెలంగాణ జనసేన ఘాటు విమర్శలు చేసింది. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే పొన్నం ప్రభాకర్ లాంటి నాయకులు, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దీనిపై ఎందుకు స్పందించడం లేదని నిలదీసింది. కాగా ఈ పోస్టులో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను లక్ష్యంగా జనసేన విమర్శలు గుప్పించడంతో తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన సభకు అనుమతి లభించకపోవడంతో పవన్ ఘాటు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ ఏమైనా కొందరి అయ్య జాగీరా? అని పవన్ ప్రశ్నించగా, దానికి మంత్రి పొన్నం తెలంగాణ బరాబర్ మా అయ్య, తాతల జాగీరే అంటూ కౌంటర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అప్పటి నుంచి పొన్నం వర్సెస్ జనసేన మధ్య ఉప్పు నిప్పులా వ్యవహారం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో కొండగట్టు విషయంలో జనసేన మంత్రి పొన్నం ప్రభాకర్ పై విమర్శలు గుప్పించడం చర్చగామారింది.

## ఎర్రగడ్డలో మొక్కలు నాటిన మంత్రి పొంగులేటి



**తిరుమలాయపాలెం,ఫ్లాష్ ఇండియా :** తిరుమలాయపాలెం మండలం గోపాలపురం గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నూతన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విద్యా వసతులను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నాం. గోపాలపురం గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న నూతన ప్రాథమిక పాఠశాల భవనం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుంది.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాం అని తెలిపారు. విద్యా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎర్రగడ్డ గ్రామంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, మాజీ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీను, ఎదులపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఎర్రగడ్డ సర్పంచ్ నల్లమల్ల శిరీష-నరేన్ కుమార్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**మయూరి సెంటర్,ఫ్లాష్ ఇండియా :** పేదల సంక్షేమంతో పాటు కార్పొరేషన్‌లో కలిసిన విలీన గ్రామాల సమగ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌ-రసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెం, 59వ డివిజన్ దానావాయిగూడెంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెంలో సుడా నిధులు రూ.100 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, 59వ డివిజన్‌లో సుడా నిధులు రూ.112.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూడా మంత్రి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిందని, ఈ కాలంలో ప్రజలకు అవ-సరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస-్తున్నామని తెలిపారు. మిగిలిన రెండున్నర సంవత్సరాల్లో కూడా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి, పేదింటి గుమ్మానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కైకొండాయిగూడెం 1వ డివిజన్‌లో శంకుస్థాపన చేసిన రూ.కోటి పనులతో కలిపి ఇప్పటివరకు సుమారు రూ.12.83 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంజూరు చేసి, అనేక పనులను పూర్తి చేశామని మంత్రి తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత తక్కువ కాలంలో ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. 1వ డివిజన్ పరిధి విస్తృతంగా ఉండటంతో ఇంకా అనేక ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అవసరం ఉందని తెలిపారు. డివిజన్‌లో మిగిలిన రోడ్ల అభివృద్ధికి అవ-సరమైన నిధులను దశలవారీగా కేటాయించి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు డైట్ ఛార్జీలు పెంచడంతో పాటు, విద్యార్థినులకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం పెంచామని చెప్పారు. పేద పిల్లలు చదువులో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్లను, రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, కులం, మతం, రాజకీయాలకు ఎలాంటి తావు ఉండదని పేర్కొన్నారు.పేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అన్నారు. ఇప్పటికే చేపట్టిన సీసీ రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, మిగిలిన ప్రాంతాల్లో అవసరమైన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురి ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు!

**ఆంధ్రప్రదేశ్ :** నేపాల్‌లో మెరుపు వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యా-త్రికుల క్షేమ సమాచారంపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. వరదల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరిలో నలుగురు సురక్షితంగా ఉన్నారని, మరో ముగ్గురి ఆచూకీ ఇంకా లభించలేదని ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు మంత్రికి వివరించారు. ఆచూకీ లభించని ముగ్గురిలో కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మి ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరి ఆచూకీ కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి లోకేష్ అధికారులను సూచించారు.ఈషా ఫౌండేషన్‌కు చెందిన శశికుమార్ చివరిసారిగా చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద కనిపించినట్లు అధికారులు వెల్లడించారు. ఆయనను గుర్తించేందుకు చైనా, నేపాల్ అధికారులతో సమన్వయం కొనసాగించాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్న కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు యాత్రికులు క్షేమంగా ఉన్నారు. సురక్షితంగా ఉన్న యాత్రికులను వీలైనంత త్వరగా అక్కడి నుంచి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని లోకేష్ అధికారులను ఆదేశించారు. యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయంతో పాటు చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ తాజా సమాచారాన్ని సేకరించాలని మంత్రి సూచించారు. ఆచూకీ లభించని ముగ్గురి కోసం ప్రత్యేకంగా సమన్వయ చర్యలు కొనసాగించాలని చెప్పారు.మరోవైపు నే-పాల్‌లో చిక్కుకున్న యాత్రికులతో పాటు మానస సరోవర యాత్రకు వెళ్లిన ఏపీ వాసుల సమాచారం సేకరణను ఆర్టీజీఎస్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్నట్లు ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ తెలిపారు. నే-పాల్ వరదల నేపథ్యంలో ఏపీ యాత్రికుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సురక్షితంగా ఉన్న వారిని స్వ-స్థలాలకు తీసుకురావడంతో పాటు, ఆచూకీ లభించని ముగ్గురి జాడ కనుగొనే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయంతో సహాయక చర్యలు కొనసాగనున్నాయి.

# శ్రీలంక-తెలంగాణ బౌద్ధ, సాంస్కృతిక, పర్యాటక బంధానికి మరింత ఊతం



**కొల్లాపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** శ్రీలంక-తెలంగాణ మధ్య బౌద్ధ, సాంస్కృతిక, పర్యాటక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు తెలిపారు.తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నాగపూర్ లోని దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం, సింగిడి సాంస్కృతిక సంస్థ సౌజన్యంతో ఇటీవల రవీంద్రభారతీలో నిర్వహించిన 4వబి నృత్యంగాణ కార్యక్రమంలో శ్రీలంక సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించిన కళాకారుల బృందం బుధవారం డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసింది.బి శ్రీలంక కళాకారుల బృందాన్ని ఈ సందర్భంగా సన్మానించారు,

**సాంస్కృతిక మార్పిడికి ప్రోత్సాహం**

శ్రంగిక ననయక్కర నేతృత్వంలోని శ్రీలంక కళాకారుల బృందం, సింగిడి సాంస్కృతిక సంస్థ డైరెక్టర్ విశ్వకర్మ డి.ఆర్.కే. ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి గారిని కలిసింది. శ్రీలంక సంప్రదాయ నృత్యాలను తెలంగాణ వేదికపై ప్రదర్శించడంపై మంత్రి అభినందనలు తెలిపారు.బౌద్ధం, సంస్కృతి, కళలు, వారసత్వం వంటి అంశాలు శ్రీలంక--తెలంగాణ మధ్య సుదీర్ఘ అనుబంధానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.నాగపూర్ దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను డైరెక్టర్ ఆస్తా కార్లేకర్..మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి వివరించారు.తెలంగాణ ప్రభుత్వం నుంచి కేంద్రానికి సహకారం అందించాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలతోనూ సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేసే కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలిపారు.త్వరలోనే నాగపూర్‌లోని దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రాన్ని సందర్శిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు గారు తెలిపారు. సాంస్కృతిక మార్పిడి, కళాకారుల పర-స్పర భాగస్వామ్యం, బౌద్ధ వారసత్వం, పర్యాటక అవకాశాలపై మరింత సహకారం పెంపొందించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

# రూ. 200 కోట్లతో జీవో జారీ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని ఆటోరిక్షా కార్మికుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని పట్టణ రవాణా వ్యవస్థను నెట్-జీరో కార్బన్ ఉద్గారాల వైపు మళ్లించేందుకు రవాణా, రహదారులు, భవనాల శాఖ అధికారికంగా జీవో జారీ చేసింది. ఈ వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం రూ.200 కోట్ల బడ్జెట్ నిధులను కేటాయించింది.

**18,766 ఆటోల మార్పిడి టార్గెట్..**

అయితే, ఈ పథకం కింద తొలి దశలో మొత్తం 18,766 పాత పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చాలని నిర్ణయించారు. ఇందులో CURE పరిధిలో తిరిగే 11,254 డీజిల్ ఆటోలు, 7,512 పెట్రోల్ ఆటోలు ఉన్నాయి. పాత ఇంధన వాహనాల నుంచి వెలువడే వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు, పెరిగిన ఇంధన ధరల భారం నుంచి ఆటో డ్రైవర్లను గట్టెక్కించనున్నారు.

**ఏకంగా రూ.1.50 లక్షల సబ్సిడీ..**

తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్ ద్వారా అర్హులైన ప్రతి ఆటో య-జమానికి ప్రభుత్వం గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు ఆర్థిక సాయాన్ని సబ్సిడీ రూపంలో అందజేస్తుంది. లబ్ధిదారులు తమ వీలును బట్టి పాత ఆటోను ఈవీగా మార్చుకోవడం, కొత్త ఈవీ ఆటో కొనుగోలు అనే రెండు విధానాలలో ఒకదాన్ని ఎంచుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. పాత ఆటోలోని ఇంజిన్‌ను తొలగించి, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారా AIS-123 ప్రమాణాలు కలిగిన ఎలక్ట్రిక్ కిట్‌ను అమర్చుకోవచ్చు. ఇందులో ఫిక్స్, బ్యాటరీ మార్చుకునే సిస్టమ్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. మరోవైపు, పాత పెట్రోల్, డీజిల్ ఆటోను స్క్రాపింగ్ చేసి కొత్త ఎలక్ట్రిక్ 3-వీలర్ కొనుగోలు చేస్తే, నేరుగా డీలర్ వద్దే ఆన్-రోడ్ ధర నుంచి రూ. 1.50 లక్షల సబ్సిడీ లభిస్తుంది. రాష్టంలో ఈ పథకం అమలు ద్వారా ఆటో డ్రైవర్ల రోజువారీ ఇంధన వ్యయం గణనీయంగా తగ్గి వారి నికర ఆదాయం పెరుగుతుంది.

# అర్హులందరికీ రేషన్ కార్డులు..

**ఉట్నూర్,ఫ్లాష్ ఇండియా :** అర్హులందరికీ రేషన్ కార్డులు.. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ మండలం లక్కారం గ్రామంలో నిర్వహించిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి అర్హుడికి రేషన్ కార్డు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అన్నారు.అదే విధంగా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. గుడిసెలు లేని గ్రామాలను చూడాలనేది సీఎం లక్ష్యమని తెలిపారు. ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వ్యక్తులను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. ప్రతి అర్హుడికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యత నాదే అని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. లక్కారం గ్రామంలో ఇప్పటికే చాలా వరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని, గ్రామంలో ఉన్న చెరువును మినీ ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేసి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.

# హరీష్ రావు అరెస్ట్



**హన్మకొండ,ఫ్లాష్ ఇండియా :** హన్మకొండ కలెక్టరేట్ ప్రాంగణం గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలపడంతో పాటు, ధర్నా నిర్వహిస్తున్న టీఎన్జీఓ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన హరీష్ రావు.. సుబేదారి పోలీస్ స్టేషన్ కు నడుచుకుంటూ వెళ్లారు.

**బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం**

హరీశ్ రావును అరెస్ట్ చేయడంపై బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులు శాంతియుతంగా ప్రజా సమస్యలపై స్పందిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు బలగాలతో నిర్బంధాలకు పాల్పడుతోందని, గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. ఈ ఘర్షణతో హన్మకొండ కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం (జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ) ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా, టీఎన్జీఓలు కూడా ధర్నా నిర్వహించాయి. తొలుత హరీశ్ రావు పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు ఉదయాన్నే హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే.. అన్ని ఆంక్షలను దాటుకుని హరీశ్ రావు హనుమకొండ కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నాలో పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారు. హరీశ్ రావు రాకతో కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో వాతావరణం మరింత వేడెక్కింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఆయనను బలవంతంగా అరెస్ట్ చేసి అక్కడి నుండి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్..

**న్యూ ఢిల్లీ :** ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న యంగ్ అథ్లెట్లను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోడీ, భారత క్రీడారంగానికి సంబంధించి ఒక కీలకమైన చేదు నిజాన్ని బయటపెట్టారు. ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా సంబరమైన ఒలింపిక్స్‌లో ఉండే మొత్తం పోటీలలో కనీసం సగం క్రీడల్లో కూడా భారత అథ్లెట్లు పాల్గొనడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనేక విభాగాల్లో మన ప్రాతినిధ్యమే లేకపోవడంతో పతకాల పట్టికలో భారత్ చాలా రకాల మెడల్స్ రేసుకు దూరమవుతోందని చెప్పారు. రాబోయే 2036 ఒలింపిక్స్ నాటికి ఈ పరిస్థితిని పూర్తిగా మార్చి, పతకాల సంఖ్యను గణనీయంగా పెంచాలని పిలుపునిచ్చారు.

**5 నుంచి 15 ఏళ్ల పిల్లలకు టాలెంట్ హంట్:**

2036 ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడా రంగాన్ని పరుగులు పెట్టించేందుకు గ్రాస్‌రూట్ స్థాయి నుంచే పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రధాని మోడీ వెల్లడించాడు. ఇందులో భాగంగానే 5 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సున్న పిల్లల కోసం దేశవ్యాప్తంగా భారీ టాలెంట్ హంట్ చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. కేవలం పిల్లలకు ఏ ఆటపై ఆసక్తి ఉందో చూడటమే కాకుండా, వారి శారీరక దారుఢ్యం, నైపుణ్యాలకు అనుగుణంగా ఏ క్రీడ పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుందో గుర్తించి దానికి తగినట్లుగా చిన్నప్పటి నుంచే ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు.

**సర్ఫింగ్, క్లైంబింగ్.. భౌగోళిక అనుకూలతలను వాడాలి:**

భారత్‌లో సుదీర్ఘమైన తీర ప్రాంతంతో పాటు భారీ పర్వత ప్రాంతాలు ఉన్నప్పటికీ, వాటర్ స్పోర్ట్స్ లేదా వింటర్ స్పోర్ట్స్‌లో మన దేశం గ్లోబల్ లెవెల్లో సరిగ్గా కనిపించకపోవడం ఆలోచించాల్సిన విష-యమని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. సర్ఫింగ్, స్పోర్ట్స్ క్లైంబింగ్ లాంటి విభాగాలలో మన దేశ భౌగోళిక పరిస్థితులు ఎంతో అనుకూలంగా ఉన్నాయని గుర్తు చేశారు. అందుకే ప్రతి జిల్లాలోని ప్రత్యేకతలకు అనుగుణంగా స్థానికంగా ఒక స్పెషల్ స్పోర్ట్స్ ఈకోసిస్టమ్ డెవలప్ చేసి, ఇప్పటి వరకు భారత్ అడుగుపెట్టని క్రీడల్లో కూడా పతకాల వేటను ప్రారంభించాలని సూచించారు. ప్రపంచపటాలు పరిశీలించండి

**ప్రభుత్వం మీకు అడుగడుగునా తోడుగా ఉంటుంది:**

భవిష్యత్తులో ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ సాధించి దేశానికి పతకాలు తేవాలనే లక్ష్యంతో శ్రమిస్తున్న యువ అథ్లెట్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రధాని మోడీ భరోసా ఇచ్చారు. కేవలం మైదానాల్లో మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, అథ్లెట్లు క్వాలిఫై అయి పతకాలు సాధించేంత వరకు ప్రభుత్వం వారికి అడుగడుగునా తోడుగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# తెలంగాణలో జనగణనకు లైన్ క్లియర్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'జనగణన-2027' ప్రక్రియకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర హోంశాఖ ఆగస్టు 14న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ నంబర్ 4505(E)ను తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో పున:ప్రచురించాలని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా గణనకు అధికారికంగా మార్గం సుగమమైంది. అయితే, జనగణన జనాభా లెక్కింపు విడతలో పౌరుల నుంచి మొత్తం 40 రకాల వివరాలను సేకరించాలని కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. 1948 సెన్సస్ చట్టంలోని నిబంధనల ప్రకారం నియమించబడే ఎన్యూమరేటర్లు ఇళ్లకు వెళ్లి ఈ వివరాలను సేకరించేందుకు అధికారం కల్పించారు.

**ఇప్పటికే 40 ప్రశ్నలకు నోటిఫై చేసిన కేంద్రం**

అయితే, జనగణనలో అడిగే 40 ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నోటిఫై చేసింది. వాటిలో కులం , కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం వంటి అంశాలు ఉన్నాయి. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. జన గణన ప్రక్రియ సెప్టెంబర్ 1న ప్రారంభమై సెప్టెబర్ 30తో ముగియనుంది. అంతకు ముందే ఆగస్టు 17 నుంచి 31 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది.

సంపాదకీయం




# రాజకీయ వ్యూహమా..?

భారత సమాఖ్య వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఈ చర్చకు వేదికగా మారడం యాదృచ్ఛికం కాదు. నీటి పంపిణీ, కేంద్ర పన్నుల వాటా, పెట్టుబడులు, మౌలిక వసతులు, విద్య, భాష, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు వంటి అంశాలు కేవలం పాలనా సమస్యలు కావు. ఇవి భారత సమాఖ్య వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రశ్నలు.భారత రాజ్యాంగం కేంద్రానికి బలమైన అధికారాలను ఇచ్చింది. అదే సమయంలో రాష్ట్రాలకు కూడా స్పష్టమైన రాజ్యాంగబద్ధ బాధ్యతలు, అధికారాలను కల్పించింది. ఈ నిర్మాణం ఉద్దేశం కేంద్రం రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయించడం కాదు. జాతీయ ప్రయోజనాలు, ప్రాంతీయ అవసరాల మధ్య సమతుల్యత సాధించడం. అందుకే కేంద్రం బలంగా ఉండటం ఎంత అవసరమో, రాష్ట్రాలు తమ పరిధిలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ఉండటం కూడా అంతే అవసరం.ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న ప్రధాన అభ్యంతరం ఆర్థిక సమాఖ్యకు సంబంధించినదే. దేశ ఆర్థిక వ్యవస్థలో దక్షిణాది రాష్ట్రాలు గణనీయమైన వాటా కలిగి ఉన్నాయి. పరిశ్రమలు, ఐటీ, సేవారంగం, పన్నుల వసూళ్లలో వాటి పాత్ర కీలకం. తమ ఆర్థిక సహకారానికి తగిన స్థాయిలో కేంద్రం నుంచి వనరులు, పెట్టుబడులు, జాతీయ సంస్థలు రావడం లేదన్న భావన ఈ రాష్ట్రాల్లో బలపడుతోంది. మరోవైపు వెనుకబడిన రాష్ట్రాలకు అధిక వనరులు అందించడం జాతీయ సమతుల్య అభివృద్ధికి అవసరమని కేంద్రం వాదిస్తోంది.ఇక్కడ ఎవరిది పూర్తిగా తప్పు, ఎవరిది పూర్తిగా నిజం అనే దానికంటే వ్యవస్థ ఎలా సమతుల్యత సాధిస్తుందనేదే ముఖ్యం. అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలను శిక్షించే విధంగా ఆర్థిక పంపిణీ ఉండకూడదు. అదే సమయంలో వెనుకబడిన ప్రాంతాలకు అవసరమైన సహాయం అందకుండా వదిలేయడం కూడా సమాఖ్య ధర్మం కాదు. వనరుల పంపిణీ పారదర్శకంగా, గణాంకాల ఆధారంగా, అన్ని రాష్ట్రాలకు అర్థమయ్యే విధంగా ఉండాలి.విద్యా రంగంలో నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలపై జరుగుతున్న చర్చ కూడా ఇదే ప్రశ్నను ముందుకు తెస్తోంది. దేశవ్యాప్తంగా ఒకే ప్రమాణం, సమాన అవకాశాలు అవసరమే. అయితే రాష్ట్రాల భాషా, సామాజిక, విద్యా పరిస్థితులను పూర్తిగా పక్కనపెట్టి ఏకరీతి విధానాలను అమలు చేయడం కూడా సమర్థవంతమైన సమాఖ్యకు సరిపోదు. జాతీయ ప్రమాణాలతో పాటు ప్రాంతీయ వాస్తవాలకు స్థానం కల్పించే విధానాలే దీర్ఘకాలికంగా ప్రయోజనకరంగా ఉంటాయి.భాష విషయంలో ఈ సున్నితత్వం మరింత అవసరం. భారతదేశం ఒకే భాష, ఒకే సంస్కృతితో నిర్మితమైన దేశం కాదు. అనేక భాషలు, సంస్కృతులు, ప్రాంతీయ గుర్తింపులు కలిసి భారతీయతను నిర్మించాయి. కాబట్టి ఒక భాషను ప్రోత్సహించడం జాతీయ ఐక్యతకు సాధనంగా ఉండొచ్చు కానీ, అది ఇతర భాషలపై ఆధిపత్యంగా కనిపించే పరిస్థితి వస్తే విభజన భావనలకు దారితీసే ప్రమాదం ఉంది. వైవిధ్యాన్ని గౌరవించడం ద్వారానే ఐక్యత బలపడుతుంది.కేంద్ర–-రాష్ట్ర సంబంధాల విషయంలో సర్కారియా కమిషన్, పుంఛీ కమిషన్ సూచనలు నేటికీ ప్రాసంగికమే. కేంద్రం--రాష్ట్రాల మధ్య సంప్రదింపులు, గవర్నర్ల పాత్రలో సమతుల్యత, అంతర్రాష్ట్ర మండలి వంటి సంస్థలను సమర్థంగా వినియోగించడం, అధికార వికేంద్రీకరణ వంటి అంశాలపై ఈ సిఫార్సులు దృష్టి పెట్టాయి. సమాఖ్య వ్యవస్థలో సమస్యలు వచ్చిన ప్రతిసారీ రాజకీయ పోరాటంగా మార్చడం కంటే సంస్థాగత పరిష్కారాలను బలోపేతం చేయడం అవసరం.ఇదే సమయంలో గవర్నర్ల వ్యవహారం, కేంద్ర దర్యాప్తు సంస్థల వినియోగం, జీఎస్టీ తర్వాత రాష్ట్రాల ఆర్థిక స్వేచ్ఛ వంటి అంశాలపై రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. కేంద్రం మాత్రం జాతీయ సమన్వయం, పరిపాలనా సామర్థ్యం, దేశవ్యాప్త విధానాల్లో ఏకరూపత అవసరమని చెబుతోంది. రెండు వైపుల వాదనల్లోనూ కొంత వాస్తవం ఉంది. కానీ నిర్ణయం రాజకీయ బలాబలాల ఆధారంగా కాకుండా రాజ్యాంగం, న్యాయం, పారదర్శకత ఆధారంగా ఉండాలి.కేంద్రం రాష్ట్రాలను ప్రత్యర్థులుగా చూస్తే సమాఖ్య వ్యవస్థ బలహీనపడుతుంది. రాష్ట్రాలు ప్రతి కేంద్ర నిర్ణయాన్ని రాజకీయ కుట్రగా చూస్తే కూడా వ్యవస్థ దెబ్బతింటుంది. ప్రజాస్వామ్యంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పర పోటీ సంస్థలు కాదు; ప్రజలకు సేవ చేయాల్సిన భాగస్వాములు. ఒకరి విజయాన్ని మరొకరి ఓటమిగా చూడటం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం.అందుకే దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం ప్రకటించే సహకారం నిజమైనదా, రాజకీయ అవసరమా అన్న ప్రశ్నకు సమాధానం మాటల్లో వెతకాల్సిన అవసరం లేదు. బడ్జెట్ కేటాయింపుల్లో, పన్నుల పంపిణీలో, పెట్టుబడుల విధానంలో, భాషా విధానంలో, విద్యా నిర్ణయాల్లో, గవర్నర్ల వ్యవహారంలో, అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారంలో ఆ సమాధానం కనిపించాలి.భారత సమాఖ్య బలం కేంద్రం ఎంత శక్తివంతంగా ఉందన్నదానిలో లేదు. రాష్ట్రాలు ఎంత గౌరవంతో భాగస్వాములుగా వ్యవహరించబడుతున్నాయన్నదానిలో ఉంది. పెద్దన్నగా వ్యవహరించే కేంద్రం కంటే సమన్వయకర్తగా వ్యవహరించే కేంద్రం ప్రజాస్వామ్యానికి ఎక్కువ ఉపయోగకరం. అదే విధంగా బాధ్యతలను విస్మరించే రాష్ట్రాల కంటే జాతీయ ప్రయోజనాలను గౌరవిస్తూ తమ హక్కులను కాపాడుకునే రాష్ట్రాలు సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేస్తాయి.చివరికి భారతదేశాన్ని కలిపి ఉంచేది కేవలం భౌగోళిక సరిహద్దులు కాదు. పరస్పర గౌరవం, రాజ్యాంగ నిబద్ధత, న్యాయమైన వనరుల పంపిణీ, భిన్నత్వానికి గౌరవం, సహకార రాజకీయ సంస్కృతే అసలు బలం. కేంద్రం–రాష్ట్రాల మధ్య పోరు పెరగడం ఎవరికీ ప్రయోజనం కాదు. సహకారం పెరగడం మాత్రమే ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి, భారత సమాఖ్య భవిష్యత్తుకు శాశ్వత పెట్టుబడి.

# సినిమా రంగానికి బాధ్యత లేదా?



క్రియేటివిటీ పేరుతో సినిమాలో వైలెన్స్ చూపిస్తున్నారా? దర్శకులకు స్క్రీన్ ప్లే, స్క్రిప్ట్ పై పట్టు ఉండటం లేదా? నిజ జీవితంలో ఎన్నడూ చూడని హింసను ఆడియన్స్ కు పరిచయం చేస్తున్నారా? సినిమాల్లో చూపిస్తున్నంత వైలెన్స్ ఎక్కడైనా జరుగుతుందా? మూవీస్ లో హింసాత్మక సీన్లతో దర్శకులు ఓవరాక్షన్ చేస్తున్నారా? వైలెన్స్ లేకపోతే మూవీస్ ను ప్రేక్షకులు ఆదరించడం లేదా?టాలీవుడ్, బాలీవుడ్, శాండల్వుడ్, కోలీవుడ్.. ఏ ఇండస్ట్రీ అయినా సినిమాల్లో స్క్రీన్ ప్లే పూర్తిగా మారిపోయింది. లవ్, రొమాన్స్, సస్పెన్స్, థ్రిల్లర్ స్టోరీస్ కి కాలం చెల్లింది. ఇప్పుడంతా యాక్షన్ మూవీసే, అలాంటి ఇలాంటి యాక్షన్ కాదు, అంతా వైలెన్స్. నిజ జీవితంలో ఆడియన్స్ చూడని, ఫేస్ చేయని హింస, రక్తపాతం. వాళ్ళు, వీళ్ళు అని తేడా ఏం లేదు, అందరూ ఆ తాను ముక్కలే. నిన్న మొన్నటి వరకు హీరోలు, విలన్ల మధ్య ఫైట్ జరిగేది. హీరో 10 లేదంటే 20 మంది విలన్లు లేదంటే రౌడీలను చితకబాదేవాడు. హీరో దెబ్బకి విలన్లు పారిపోయేవాళ్ళు. అదంతా గతం! మారుతున్న కాలానికి అనుగుణంగా సినిమాల్లోనూ వైలెన్స్ పెరిగిపోతోంది. నువ్వా నేనా అన్నట్లు హింసాత్మక సీన్స్ తీసేందుకు దర్శకులు పోటీ పడుతున్నారు. తమ సినిమాల్లో హింసకి ప్రాధాన్యతను ఇస్తున్నారు. వైలెన్స్ కే వణుకు పుట్టేలా స్క్రీన్ ప్లేను అదరగొడుతున్నారు. హింస అంటే మరి ఇంతలా ఉంటుందా? మనుషుల్ని ఘోరంగా టార్చర్ చేస్తారా? ఇలా కూడా వైలెన్స్ ని చూపించవచ్చా? అనే రీతిలో దర్శకులు రెచ్చిపోతున్నారు. సినిమా చూస్తున్న ప్రేక్షకుడికి కూడా విరక్తి కలిగేలా సీన్స్ తీస్తున్నారు. ఇటీవల కాలంలో విడుదలైన ఏ సినిమాను తీసుకున్నా ఓ రేంజ్ లో వైలెన్స్ ని ప్రెసెంట్ చేశారు. నిత్య జీవితంలో అంత వైలెన్స్ ఉండదు. మరి సినిమాల్లో మాత్రమే ఎందుకు భరించలేనంత, ఊహించలేనంత హింస చూపించడం ఏంటి?క్రియేటివిటీ లేకపోవడంతో వైలెన్స్ కి పెద్ద పీట వేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. క్రియేటివిటీ అంటూ డబ్బాలు కొట్టుకుంటున్న దర్శకులు.. క్రియేటివిటీ అంటే మితిమీరిన హింసాత్మక సీన్స్ తెరకెక్కించడమేనా? స్క్రిప్ట్ మీద పట్టు లేని వారందరికీ వైలెన్స్ సబ్జెక్ట్ గా మారిపోయింది. 20 ఏళ్ల క్రితమే దర్శకుడు రాంగోపాల్ వర్మ అంతం, సత్య, సర్కార్ లాంటి సినిమాలు తీస్తే నెత్తి నోరు బాదుకున్నారు. ఇప్పటి దర్శకులకు మాత్రం హింసే పెద్ద సబ్జెక్ట్ గా మారిపోయింది. ప్రెజెంట్ డైరెక్టర్స్ తమలోని ఫ్రస్ట్రేషన్ ని జనం మీద తీర్చుకుంటున్నారు. క్రియేటివిటీ అంటే మోర్ వైలెన్స్ అంటూ జబ్బలు చరుచుకుంటున్నారు. జీవితాల్లో లేని హింస, రక్తపాతం సినిమాల్లో ఎందుకన్నది మాత్రం ఒక్కరూ ఆలోచించడం లేదు. సమాజంలో జరుగుతున్న సంఘటనలకి, తెర మీద దర్శకులు చూపిస్తున్న వైలెన్స్ కి అసలు సంబంధమే ఉండటం లేదు. రక్తపాతం, హింస చుట్టూ కథలు అల్లుకొని తాము తీసిందే సూపర్ అని దర్శకులు ఫీల్ అయిపోతున్నారు.తెర మీద రక్తపాతం క్రియేట్ చేస్తే కలెక్షన్ల వర్షం కురుస్తుందా? ఘోరమైన హింసను చూసేందుకు జనం థియేటర్స్ కి వస్తారా? హీరోలు విలన్ల తలలు నరకడం, లేదంటే సుత్తితో బాదడం, పాయింట్ బ్లాంక్ లో ప్రైవేట్ పార్ట్స్ లో కాల్చడం వంటి సీన్స్ నే డైరెక్టర్స్ గ్రేట్ గా ఫీల్ అవుతున్నారు. అసలు హింస లేకుండా సినిమా తీసే సత్తా లేదా? వైలెన్స్, రక్తపాతం లేని సినిమాలను ఆడియన్స్ ఆదరించరనే భయం పట్టుకుందా? డైరెక్టర్స్ ఎందుకు టాక్సిక్ గా ఆలోచిస్తున్నారు అన్నదే ఆడియన్స్ కి అర్థం కావడం లేదు. సినిమాల్లో టూ మచ్ వైలెన్స్ చూపించడం ఎందుకు? దానికి పిల్లలు సినిమాని చూడొద్దని కండిషన్స్ పెట్టడం ఎందుకు? ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అయ్యే హాలీవుడ్ సినిమాల్లో కూడా టాలీవుడ్, బాలీవుడ్ లో ఉన్నంత హింస, రక్తపాతం, ఒళ్లు గగురు పొడిచే సీన్స్ ఉండవు. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో మాత్రమే శృతి మించిన రక్తపాతం, హింస కనిపిస్తున్నాయి. ఒక్క డైరెక్టర్ కూడా లాజిక్ గా ఆలోచించడం లేదు. మన దర్శకులు కలెక్షన్ల కోసం ఎంతకైనా దిగజారుతున్నారు. శవాల మీద పేలాలు ఏరుకున్నట్లు హింస, రక్తపాతంతోనే డబ్బు సంపాదించాలని దుర్మార్గంగా ఆలోచిస్తున్నారు.సినిమాల్లో విపరీతమైన వైలెన్స్ చూపిస్తుంటే సెన్సార్ బోర్డు ఏం చేస్తోంది? అనేక కారణాలతో సినిమాలకు రెడ్ ఫ్లాగ్ చూపించే సెన్సార్ బోర్డు.. హింస, రక్తపాతం పై ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది? ఇష్టమున్న సినిమాలకు క్లీన్ చిట్ సర్టిఫికెట్ ఇవ్వడం, నచ్చని వాటిని అడ్డుకోవడమే సెన్సార్ బోర్డ్ లక్ష్యమా? వైలెన్స్, బ్లడెడ్ మూవీస్ ను ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇండియాలో ప్రతి ఏడాది వివిధ భాషల్లో వందల సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. అందులోనూ సౌత్ ఇండియాలో మెజారిటీ సినిమాలు తెరకెక్కుతున్నాయి. పాన్ ఇండియా పేరుతో ఆడియన్స్ ముందుకు వస్తున్నాయి. ఇటీవల భారీ కలెక్షన్స్ సాధించిన సినిమాలు అన్నింటిలోనూ స్టోరీ, స్క్రీన్ ప్లే కంటే హింస, రక్తపాతమే డామినేట్ చేశాయి. ఆ సీన్స్ చూస్తున్న ఆడియన్స్ కే ఒళ్లు గగురు పొడుస్తోంది. ఎంత భయంకరంగా చూపిస్తే ఆడియన్స్ అంతలా కనెక్ట్ అవుతారనే ట్రాన్స్ లో డైరెక్టర్స్ ఉన్నారు.అనిమల్, దురంధర్ వన్, దురంధర్ 2, కేజీఎఫ్, కేజీఎఫ్ 2, డిసి, విక్రమ్, హిట్ త్రీ, జైలర్, సలార్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సినిమాల్లోని రక్తపాతం, వైలెన్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. త్వరలో విడుదలయ్యే టాక్సిక్, స్పిరిట్, డ్రాగన్ లోనూ డైరెక్టర్స్ హింసకే ప్రాధాన్యతను ఇచ్చినట్లు తెలుస్తోంది. డైరెక్టర్స్ అంత ఘోరంగా సీన్లు తెరకెక్కిస్తే సెన్సార్ బోర్డు ఏం చేస్తోంది? చిన్న చిన్న విషయాలకి మూవీస్ ని అడ్డుకునే సెన్సార్ బోర్డ్.. వైలెన్స్, బ్లడెడ్ సీన్ల విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు న్యూస్ ఛానల్స్ కి మాత్రమేనా? సెన్సార్ బోర్డ్ కి అక్కర్లేదా? న్యూస్ ఛానల్స్ లో రేప్స్, మర్డర్స్ గురించి చూపించొద్దన్న నిబంధనలు ఉన్నాయి. రక్తపు చుక్క కనిపించకూడదని ఆదేశాలు అమలవుతున్నాయి. అత్యాచార కేసుల్లో నిందితులు, బాధితులను చూపించకుండా మాస్క్ వేయాలని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చెబుతోంది. మరి సినిమాల్లో బ్లడెడ్ సీన్స్, వైలెన్స్ చూపిస్తుంటే సెన్సార్ బోర్డ్ పట్టించుకోదా? మీడియా మీద ఆంక్షలు పెట్టినట్లే, సినిమాలపై ఎందుకు పెట్టడం లేదు? సినిమా రంగంపై సెన్సార్ బోర్డ్ కి అంత ప్రేమ ఎందుకు? మూవీస్ లో ఘోరాతి ఘోరంగా రేప్ సీన్స్ ను చూపిస్తారు. విచక్షణారహితంగా ప్రత్యర్థులను చంపటం, నరకడం, కాల్చడం, హింసించడాన్ని గ్రేట్ గా ఫీల్ అవుతారు.మీడియాకి బాధ్యతలు ఉన్నట్లే, సినిమా రంగానికి లేవా? వారికి మాత్రమే మినహాయింపులు ఎందుకు? సినిమా నిబంధనలని ఎందుకు కఠినతరం చేయడం లేదు? సినిమాల్లో క్రూరత్వానికి కొత్త నిర్వచనం చెబుతున్నారు మన దర్శకులు. టూ మచ్ వైల్డ్ గా ఆలోచిస్తున్నారు. సైకోలు, గుండాలు, రౌడీలు, గ్యాంగ్ స్టర్స్ తమ జీవితంలో చేయలేనంత విధంగా సినిమాల్లో సీన్స్ తెరకెక్కిస్తున్నారు. దురంధర్ వన్, దురంధర్ 2 సీన్స్ చూస్తే ఎవరికైనా ఒళ్లు గగురుపుడుతుంది. ఈ మూవీస్ లో హింస గురించి ఎంత చెప్పినా తక్కువే. రెహ్మాన్ డెకాయిడ్ గా, అక్షయ్ కన్నా విలనిజం క్యారెక్టర్ లోనూ క్రూరత్వం చూస్తే.. మనుషులు ఇంత దారుణంగా ఉంటారా అన్న ప్రశ్నలు వస్తాయి. అనిమల్, సలార్, విక్రమ్, జైలర్, మార్కో, ఇటీవల రిలీజ్ అయిన డిసి మూవీ.. ఇలా రక్తపాతం, హింస చుట్టూ సినిమా మెుత్తం నడుస్తుంది. వైలెన్స్ కే కొత్త నిర్వచనం చెబుతున్నారు. మనుషులని ఇలా కూడా చంపొచ్చా? సమాజంలో జనాన్ని ఇలా హింసిస్తారా? పైశాచికంగా ప్రవర్తిస్తారా? అన్న ప్రశ్నలు వస్తున్నాయి. చిత్రాల్లో ఉన్న వైలెన్స్ ని పబ్లిసిటీకి వినియోగించుకుంటున్నారు. జనం చూడలేని సీన్స్ ని, స్క్రీన్ నుంచి మొహం తిప్పేసుకునే వైలెన్స్ కాదంటూ సమర్థించుకుంటున్నారు.సినిమాల్లో రక్తపాతం, హింసాత్మక సీన్లు జనంపై ప్రభావం చూపవా? అంటే కచ్చితంగా చూపుతాయి. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన సెన్సార్ బోర్డ్ వైలెన్స్ పై సైలెన్స్ అంటోంది. తమ సినిమాలకి టికెట్ రేట్స్ పెంచుకోవడానికి నిర్మాతలు, హీరోలు, దర్శకులు ప్రభుత్వం చుట్టూ తిరుగుతారు. తమ పనులు చేయించుకోవడానికి వంగి వంగి దండాలు పెడతారు. మరి సెన్సిటివ్ సీన్స్ విషయంలో దర్శకులు, నిర్మాతలు, హీరోలు జాగ్రత్తలు తీసుకోరా? డబ్బు కోసం ఎంతకైనా దిగజారుతారా? హీరో రక్తపాతం క్రియేట్ చేసినా, అమాంతంగా 10 మంది రౌడీలను లేపేసినా వేదికల మీద గొప్పగా చెప్పుకుంటారు. ఫలానా సీన్ సినిమాకే హైలైట్ అంటారు. రూల్స్ మాత్రం పట్టించుకోరు. మీడియా పై ఆంక్షలు పెట్టే సమాచార, సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖలు.. సినిమాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. ప్రస్తుత కాలంలో చాలా మంది హింసాత్మక, భయానక సినిమాలకే జై కొడుతున్నారు. అలాంటి మూవీస్, వెబ్ సిరీస్ కు భారీ రెస్పాన్స్ వస్తోంది. ప్రెజెంట్ ఈ చిత్రాలు బాక్సాఫీస్ లో మంచి సక్సెస్ సొంతం చేసుకుంటున్నాయి.కానీ సినిమాల్లో చూపించే హింస ఒక మనిషిని ఎన్నో విధాలుగా ప్రభావితం చేస్తుంది. ప్రెజెంట్ సినిమాల్లో హింస విపరీతంగా పెరిగిపోయింది. యాక్షన్ సినిమాల పేరుతో రక్తపాతం, బూతులు, క్రూరమైన దృశ్యాలను ఎక్కువగా చూపిస్తున్నారు. ఇది సమాజంపై, ముఖ్యంగా యువతపై చెడు ప్రభావం చూపిస్తోంది. సినిమాల్లో హింస పెరగడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. ప్రేక్షకులు థ్రిల్ కోరుకుంటున్నారు కాబట్టి మేకర్స్ హై వోల్టేజ్ యాక్షన్ సీన్లని వాడుతున్నారు. గుండాగిరి, మాస్ ఎలివేషన్స్ సినిమా విజయానికి షార్ట్ కట్ గా మారాయి. హాలీవుడ్, ఇతర భాషల చిత్రాల స్ఫూర్తితో హింసాత్మక కథలను ఎంచుకుంటున్నారు. సమాజంపై ప్రభావం చూపుతుందని దర్శకులు ఆలోచించడం లేదు. చిన్న పిల్లలు, యువత ఈ హింసను చూసి నిజ జీవితంలోనూ దూకుడుగా ప్రవర్తించే అవకాశం ఉంది. సినిమా సీన్స్ ని ఫాలో అయి ఎంతో మంది నేరాలకు తెగబడ్డారు. సినిమా అంటే వ్యాపారం, అవును అది ఎవ్వరూ కాదనలేని సత్యం. సినిమాలు తీసేందుకు కోట్లలో ఖర్చవుతుంది. దానిని రాబట్టుకునేందుకు ఎన్నో రకాల మ్యాజిక్లు చేయాల్సి ఉంటుంది. అందుకని నరుక్కోవడాలు, చంపుకోవడాలతో హింసని మాత్రమే హైలైట్ చేయడం వల్ల సమాజానికి జరుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు? అంటే సమాధానం దొరకదు.కొంతకాలంగా ఆడియన్స్ కూడా హింస, రక్తపాతం సినిమాలకి అలవాటు పడిపోతున్నారు. అనిమల్ మూవీలో రణ్బీర్ కపూర్ క్రూరత్వం నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది. ఇది మామూలు వైలెన్స్ కాదు, దాన్నే దర్శకులు ఒక రోగంగా మార్చుకుంటున్నారు. సినిమాల ప్రభావంతో నేరాలు పెరగటం, గ్యాంగ్ స్టర్స్, రౌడీ షీటర్స్ లా యువత మారిపోతున్నారు. సమాజంలో హీరోలు అనిపించుకునేందుకు బహిరంగంగా హత్యలు చేస్తున్నారు. మారణాయుధాలతో వీడియోలు పోస్ట్ చేస్తున్న ఘటనలు నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. వాళ్ళు చూస్తున్నారు కాబట్టి మేము తీస్తున్నాం అంటారు డైరెక్టర్స్, నిర్మాతలు. వాళ్ళు తీస్తున్నారు కాబట్టి మేము చూస్తున్నామని ఆడియన్స్ వాదిస్తున్నారు. సో ఇక్కడ ఎవరిది తప్పు అనేది చెప్పడం చాలా కష్టం. సినిమాలను చూసి ఎంతో మంది క్రిమినల్స్ గా మారిపోతున్నారు. రక్తపాతం పారిస్తే కలెక్షన్స్ వస్తాయని నిర్మాతలు, దర్శకులు భావిస్తున్నారు. కుక్కను చూసి నక్క వాత పెట్టుకున్నట్లు, ఆ దర్శకుడు తీశాడు కాబట్టి తాను కూడా అంతకుమించిన హింసలో సైకోయిజాన్ని చూపించాలనే రీతిలో కథలు రాస్తున్నారు. దాన్నే జనం మీదకు వదులుతున్నారు. మరి ఇలాంటి సినిమాల వల్ల సమాజానికి ఏం ఉపయోగం? సినిమాలతో సమాజంలో పాజిటివిటీని పెంచకపోయినా పర్వాలేదు కానీ, నెగిటివిటీని పెంచుతూ ఉండటమే ప్రెజెంట్ వచ్చిన సమస్య.సమాజానికి నష్టం కలిగిస్తున్న అనేక వస్తువులపై ప్రభుత్వాలు భారీగా పన్నులు వసూలు చేస్తున్నాయి. కొన్నింటిని బ్యాన్ చేస్తున్నాయి. మరికొన్నింటిపై ఆంక్షలు విధిస్తున్నాయి. మరి వైలెన్స్ కాంటెంట్ ఉన్న సినిమాలకి ఎందుకు రెండింతలు, మూడింతల పన్ను విధించకూడదు? ఆ పన్ను కట్టేందుకు సిద్ధమైన వాళ్లే వైలెన్స్ సినిమాలు తీస్తారు. సినిమాలో ఉన్న స్టాండర్డ్స్ ఆధారంగా సెన్సార్ బోర్డ్ సర్టిఫికేట్ ఇచ్చినట్టుగానే, ప్రభుత్వం కూడా వైలెన్స్ ఆధారంగా పన్ను స్లాబ్స్ అమలు చేయాలి. అప్పుడే వైలెన్స్ విషయంలో దర్శకులు, నిర్మాతలు జాగ్రత్త పడతారు. భారత రాజ్యాంగం ప్రకారం నేరం చేయటమే కాదు, నేరాన్ని ప్రోత్సహించినా నేరంగానే పరిగణిస్తారు. ఆ కోణంలో చూస్తే సినిమాల్లో నేరాలు చేయటాన్ని హీరోయిజంగా చూపించడం ముమ్మాటికీ తప్పే. అలాంటి సినిమాలపై నిషేధం విధించడం చట్ట పరిధిలో లేకపోతే కనీసం అధిక పన్నులు విధించడం ద్వారా సమాజానికి కొంతైనా మేలు చేయొచ్చు. పన్ను భయంతో సినిమాల్లో కనీసం హింస కాంటెంట్ తగ్గించే అవకాశాలు పెరుగుతాయి.సినిమాల్లో వైలెన్స్ పెరిగిపోతోంది. దానికి జనాలు అడిక్ట్ అవుతున్నారు, అదే కరెక్ట్ అనుకుంటున్నారు. కాబట్టి మారాల్సింది ఫిల్మ్ స్టాండర్డ్స్. మనం కూడా సినిమాని సినిమాలా చూడాలి, రియాలిటీని రియాలిటీగా చూడాలి. మనిషి జీవితంలో సినిమాల్లో చూపించినంత వైలెన్స్ ఉండదు. కానీ సినిమాల్లో మాత్రమే మసిపూసి మారేడుకాయ చేసి హింస, రక్తపాతాన్ని చూపించేస్తున్నారు. యువత అడిక్ట్ అయి నేరాలకు పాల్పడుతున్నారు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# ఇంకా మానని సిగాచి గాయం

**సంగారెడ్డి అర్బన్,ఫ్లాష్ ఇండియా :** పాశమైలారం పారిశ్రామికవాడలో ఆ నాటి పేలుడు శబ్దం ఇంకా 54 కుటుంబాల చెవుల్లో మార-ుమోగుతూనే ఉంది. సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం జరిగి 13 నెలలు గడుస్తున్నా, ఆ గాయం ఇంకా మానలేదు. అప్పుడు ప్రభుత్వం ఇచ్చిన కోటి రూపాయల హామీ నేటికీ కాగితాలకే పరిమితమైందని బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. 2025 జూన్ 30న జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో గుర్తు పట్టడానికి డీఎన్ఏ పరీక్షలు చేయాల్సి వచ్చింది. ఆ రోజు ఆ మృతదేహాలకు డీఎన్ఏ పరీక్ష అయితే, ఈ రోజు బతికి ఉన్న వారి కుటుంబ సభ్యులు పరిహారం కోసం పరీక్షలు ఎదుర్కొంటున్నారు. ప్రమాదం జరిగిన రోజు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనసుతో ఒక్కో కుటుంబానికి కోటి రూపాయలు ఇస్తామని ప్రకటించింది. కానీ 13 నెలలు తిరిగినా వారి ఖాతాల్లో జమ అయింది కేవలం రూ.42 నుంచి 45 లక్షలే. ఇంకా సగానికి పైగా సొమ్ము రావాల్సి ఉంది. అధికారిక లెక్కల ప్రకారమే ఇంకా దాదాపు రూ.30 కోట్ల రూపాయల బకాయి ఉంది. కంపెనీ మాత్రం తమ వంతుగా చెల్లించామని చెబుతోంది. కానీ కార్మికులకు చట్టప్రకారం రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ డబ్బులను కూడా పరిహారంలో కలిపి చూపిస్తోందని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. చనిపోయిన కార్మికుడి సొంత డబ్బునే పరిహారంగా చూపడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేష్ కుమార్ చౌదరి, సుష్మ, దివ్యల పరిస్థితి దయనీయంగా ఉంది. బతికున్నా చచ్చినట్టే బతుకుతున్నామని ముగ్గురు క్షతగాత్రులు ఆవేదన వ్యక్తం చేస-ున్నారు. తీవ్ర గాయాలతో శరీరం కాలిపోయి, ముఖం వికృతమై పని చేసుకునే పరిస్థితి లేదు. వారికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించినా, అది కూడా పూర్తిగా అందలేదని, ఆసుపత్రి బిల్లుల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నామని వాపోతున్నారు. వారి పరిహారాన్ని రూ.50లక్షలకు పెంచడంతో పాటు, ఉన్నత విద్యావంతులైన సుష్మ, దివ్యలకు హైదరాబాద్ పరిసరాల్లోని ఫార్మా కంపెనీల్లో శాశ్వత ఉద్యోగం కల్పించాలని కోరుకుంటున్నారు. కోటి హామీతో ఓదార్చిన ప్రభుత్వం, ఇప్పుడైనా మిగిలిన పరిహారాన్ని విడుదల చేసి 54 కుటుంబాల్లో ఆగని ఆవేదనకు ముగింపు పలకాలని బాధితులు కోరుతున్నారు.



## అధికారుల కొరడా

**వనపర్తి క్రైం/పెద్దమందడి,ఫ్లాష్ ఇండియా :** అనుమతులు లేకుండా నిర్మించిన రైస్‌మిల్లు పై అధికారులు చర్యలు చేపట్టారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల సమీపంలోని సర్వేనంబర్ 327లో నిర్మించిన చాముండి రైస్‌మిల్లు నిర్మాణానికి అవసరమైన అనుమతులు లేవని అధికారులు గుర్తించారు. నిర్మాణానికి సంబంధించి అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేసినప్పటికీ మిల్లు యాజమాన్యం నుంచి స్పందన లేకపోవడంతో... చర్యలకు ఉపక్రమించారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు ఎమ్మార్వో మల్లికార్జున్, ఎంపీడీవో పరిణితి, ఎస్సై జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది మోజర్ల సమీపంలోని రైస్‌మిల్లు వద్దకు చేరుకున్నారు. జేసీబీతో అక్రమంగా నిర్మించిన షెడ్డును కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సంబంధిత అనుమతులు పొందకుండా నిర్మాణాలు చేపడితే.. నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, పంచాయతీ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# పెరుగుతున్న మరణాల సంఖ్య

**న్యూ ఢిల్లీ :** నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు, కొండచరియలు భారీ విధ్వంసాన్ని సృష్టించాయి. హిమా లయ ప్రాంతంలో హిమనదం కూలిపోవడం, దాని ప్రభావంతో నదుల్లో ఒక్కసారిగా భారీగా నీరు, మట్టి, రాళ్లు ప్రవహించడంతో పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఈ విపత్తులో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజా నివేదికల ప్రకారం నేపాల్లోనే మృతుల సంఖ్య 175కు చేరింది . వందలాది మంది ఆచూకీ తెలియకపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు 826 మంది ఆచూకి తెలియడం లేదని అధికారులు ప్రకటించారు.

**ఒక్కసారిగా విరుచుకుపడిన వరద**

బోటేకోషి నది పరివాహక ప్రాంతంలో భారీగా వరద నీరు ప్రవహించడంతో గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నీటి ప్రవాహంతో పాటు భారీగా మట్టి, బండరా ళ్లు కొట్టుకు రావడంతో అనేక ప్రాంతాల్లో స హాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దాదాపు 40 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్లు నివేదికలు వెల్లడి స్తున్నాయి.

**వందలాది మంది గల్లంతు**

వరదల అనంతరం నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు గల్లం తయ్యారు. వివిధ నివేదికల ప్రకారం వందల నుంచి 1,500 మందికి చేరువలో ఆచూకీ తెలియని వారి సంఖ్య ఉన్నట్లు సమాచారం. వీరిలో పెద్ద సంఖ్యలో విదేశీ పర్యాటకులు, కైలాస్ మానస-సరోవర్ యాత్రికులు ఉన్నారు.

**భారతీయుల కోసం తీవ్ర గాలింపు**

గల్లంతైన వారిలో భారతీయుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. నేపాల్ అధికారులు, పర్యాటక శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం 300 మందికి పైగా భారతీయ యాత్రికులు, పర్యాటకుల ఆచూకీపై ఆందోళన నెలకొంది . వీరిలో కైలాస్ మానససరోవర్ యాత్రకు వెళ్లిన పలువురు ఉన్నారు.

**కైలాస్ యాత్రికుల్లో ఆందోళన**

టిబెట్ లోని కైలాస్ మానససరోవర్ యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న పలువురు యాత్రికులు వరద ప్రభావిత ప్రాంతంలో చిక్కుకున్నట్లు సమాచారం. రహదారులు తెగిపోవడం, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో కుటుంబ సభ్యులకు వారితో సంబంధాలు తెగిపో యాయి. దీంతో భారత్లోని యాత్రికుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

**ఈషా ఫౌండేషన్ సభ్యుల పరిస్థితిపైనా ఆందోళన**

కైలాస్ యాత్రకు వెళ్లిన ఈషా ఫౌండేషన్ బృందంలోని సభ్యుల పరిస్థితిపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ బృందంలో 77 మంది ఉన్నట్లు సమాచారం. వారిలో పలువురి ఆచూకీపై స్పష్టత కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు.

**ముమ్మరంగా సహాయక చర్యలు**

నేపాల్ సైన్యం, పోలీసులు, రెస్క్యూ బృందాలు హెలికాప్టర్లు, డ్రోన్లు, ఇతర ఆధునిక పరికరాలతో గాలింపు చేపట్టాయి. వరద నీరు, బురద, దెబ్బతిన్న రహదారుల కారణంగా కొన్ని ప్రాంతాలకు చేరుకోవడం కష్టంగా మారింది. టిబెట్ వైపు కూడా చైనా అధికారులు గల్లంతైన వారి కోసం భారీ సా-ుయిలో గాలింపు చేపట్టారు. భారత్ కూడా సహాయక చర్యలకు మద్దతు ప్రకటించింది. అత్యవసర సామగ్రితో కూడిన సహాయాన్ని నేపాలకు పంపడంతో పాటు, భారతీయుల ఆచూకీ తెలుసుకునేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తోంది.

**మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం**

ఇప్పటికీ అనేక మంది గల్లంతై ఉండటం, కొన్ని ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు పూర్తిస్థాయిలో చేరుకోలేకపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. శిథిలాలు, బురద తొలగిస్తూ గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగు తోంది. హిమాలయ ప్రాంతంలో పరిస్థితి ఇంకా ప్రమాదకరంగానే ఉన్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నేపాల్-టిబెట్ సరిహద్దులో చోటుచేసుకున్న ఈ విపత్తు కైలాస్ మానస సరోవర్ యాత్రికుల భద్రతపై తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుండగా.. రెస్క్యూ బృందాల గాలింపుపైనే వారి ఆశలు నిలిచాయి.

# అనుబంధానికి 'రక్ష'

**మహబూబాబాద్,ఫ్లాష్ ఇండియా :** అన్నాచెల్లెల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ వచ్చింది. శుక్రవారం అక్కాతమ్ముళ్లు ఆనందోత్సవాల మధ్య పండుగను జరుపుకోనున్నారు. ఈ రాఖీ పర్వదినంపై నాటి నుంచి నేటి వరకు అనేక పురాణాలు, కథలు ప్రచారంలో ఉన్నాయి. సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు ఎంతో రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. మార్కెట్‌లో రుద్రాక్ష, స్టోన్, వెండి, బంగారు రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుందన్‌లు, మెరుపులు జరీతో పాటు స్పాంజితో తయారు చేసిన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. పిల్లలను ఆకర్షించేందుకు కార్టున్ రాఖీలు కూడా వచ్చాయి. పాతకాలంలో అతిపెద్దగా ఉండే రాఖీలు ధరించేవారు. రానురాను అవి చిన్నగా మారిపోయాయి. మళ్లీ ఈ సంవత్సరం మార్కెట్‌లోకి పెద్దపెద్ద రాఖీలు దుకాణాల్లో దర్శనిమిచ్చాయి. దూరప్రాంతాల్లో ఉన్న సోదరులకు సోదరీమణులు కొరియర్, పోస్టు ద్వారా ముందుగానే రాఖీలు పంపించారు. కాగా, ఒక్క రూపాయి నుంచి మొదలుకుని రూ.1000 వరకు రాఖీ ధరలు పలుకుతున్నాయి.

**హిందూ పండుగల్లో ఒకటి..**

హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ వేడుక సోదర, సోదరీమణులకు మధ్య ప్రేమకు గుర్తుగా పేరుగాంచింది. రాఖీ కట్టిన తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రాఖీకట్టి స్వీటు తినిపించి, హారతినిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. ఈ పండుగ ప్రతీ సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. రక్షాబంధన్ అనే పదం రక్ష, బంధన్ అనే రెండు పదాలతో ఏర్పడింది. దేవతామూర్తుల కాలం నుంచి ఈ పండుగను జరుపుకుంటున్నట్లుగా చరిత్ర ద్వారా తెలుస్తోంది.

**ఎందుకు జరుపుకుంటారంటే..**

ఒకరోజు శ్రీగణేశుడు తన సోదరి మానసదేవితో రాఖీ కట్టించుకుంటుండగా అప్పుడు ఇద్దరు కుమారులు శుభ్, లాబ్‌లు ఇది ఏంటని అడిగారట. అప్పుడు గణేశుడు ఇది రక్షణ కవచం అని, ఈ రక్షాసూత్రం సోదర సోదరీమణుల మధ్య ప్రేమకు ప్రతీక అని చెప్పాడట. ఇది విన్న శుభ్, లాభ్‌లు తమకి కూడా ఒక సోదరి కావాలని పట్టుబట్టగా తన కుమారుల కోరిక మేరకు గణేశుడు తన శక్తుల నుంచి ఒక మంటను సృష్టించి, దానిని తన భార్యలు సిద్ధి, బుద్ధిల ఇద్దరి ఆత్మశక్తితో కలిపి ఆ వెలుగు నుంచి ఒక అమ్మాయి జన్మించింది. ఆ అమ్మాయికే సంతోషిమాత అని పేరు పెట్టారట!

**28న పండుగ ఇలా..**

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆడపడుచులు ఈ ఏడాది రాఖీ పర్వదినాన్ని సుఖఃసంతోషాలతో జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. 27వ తేదీ నాటికే పుట్టింటికి చేరుకునేందుకు తరలివస్తున్నారు. రాఖీ పర్వదినాన్ని రాఖీ పౌర్ణమి, శ్రావణపౌర్ణమి, జంజాల పౌర్ణమి కూడా పిలుస్తారు. 28న పౌర్ణమి తిథి కాబట్టి ఈ రోజే రాఖీ పౌర్ణమి జరుపుకోవాలని వేద పండితులు, అర్చకులు చెబుతున్నారు. రేపు రాఖీ పర్వదినాన్ని జరుపుకోవచ్చనే పండితుల సూచనల మేరకు ఆడపడుచులు రాఖీలు, స్వీట్లతో పుట్టింటికి చేరుకుంటున్నారు. ఈనెల 28న సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టుకోవచ్చని వేద పండితులు చెబుతున్నారు.

# గిరిజన విద్యకు గ్రహణం !



**మంగపేట,ఫ్లాష్ ఇండియా :** మంగపేట మండలంలో ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ స్కూళ్ల విద్య మిథ్యగా మారింది. కోమటిపల్లి, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి మూడు పే యూనిట్లలోని 21 టీడబ్ల్యూపీఎస్ పా-ఠశాలల్లో కేవలం 197 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నట్లు విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. 14 మంది రెగ్యులర్, 9 మంది డిప్యూటేషన్ పై ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. 21 పాఠశాలల్లో పనిచేస-ున్న ఉపాధ్యాయులకు నెల నెల సుమారు రూ.37 లక్షలు ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. మండలంలోని మామిడిగూడెం, మొట్లగూడెం, పాత చీపురుదుబ్బ గ్రామాల్లో ఒక్క విద్యార్థి కూడా హాజరుకాకపోవడంతో పాఠశాలలు మూతపడగా, 11 పాఠశాలల్లో నామమాత్రంగా సింగిల్ డిజిట్ విద్యార్థులు హాజరవుతుండడం గమనార్హం. ప్రభుత్వం నెలనెల లక్షలు ఖర్చు చేసి మండలంలోని గిరిజన పిల్లల విద్యావికాసం కోసం ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ స్కూళ్లను ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, మౌలిక వసతులు కల్పించకపోవడంతో గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడానికి నిరాకరిస్తున్న పరిస్థితి. ఒక్కో గ్రామంలో 1 నుంచి 5వ తరగతి వరకు గిరిజన పిల్లలకు ప్రభుత్వ నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఐటీడీఏ ఏటూరునాగారం పర్యవేక్షణలో మండలంలో 21 టీడబ్ల్యూపీఎస్ స్కూళ్లను ఏర్పాటు చేశారు. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో స్కిల్స్ లేకపోవడంతో పాటు పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడంతోనే తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో 21 ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ స్కూళ్లలో మెజార్టీ స్కూళ్లలో సింగిల్ డిజిట్ విద్యార్థులు ఉండడం గమనార్హం. ఉన్న పాఠశాలలకు సైతం ఉపాధ్యాయులు సకాలంలో హాజ-రుకాకపోవడం వృత్తిపరమైన సమావేశాలు, సంఘం సమావేశాలకు తోడు స్వంత పనులు చూసుకుంటుండడంతో పాఠశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయి. గిరిజన పిల్లలకు ప్రభుత్వ విద్య 1 నుంచి 5 వరకు అందే పరిస్థితులు మండలంలో కనుమరుగయ్యాయనే చెప్పాలి. పాఠశాలలను పర్యవేక్షించాల్సిన ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు ఏళ్లతరబడి అటు వైపు చూడకపోవడం, విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, మంత్రి సీతక్క మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ స్కూళ్లపై దృష్టి సారించి మండలంలోని 21 పాఠశాలలను సందర్శించాలని కోరుతున్నారు. విద్యార్థుల ఉపాధ్యాయుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు కుదించి మండలంలోని ప్రధాన గ్రామాల్లో ట్రైబల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఉపాధ్యాయుల్లో నైపుణ్యం లేకనే ప్రైవేటుకు..**

**కోరెం నర్సింహులు, మొట్లగూడెం.**

ఉపాధ్యాయుల్లో నేటి పరిస్థితులకు అనుగుణంగా విద్యా నైపుణ్యం లేకనే తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. 3 దశాబ్దాల క్రితం గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటుకు ఎంతో కష్టపడ్డా. ఆ పాఠశాల నేడు మూతపడడం చూస్తుంటే బాధకలుగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియం కొరకు ప్రైవేటు పాఠశాలలకు పంపడంతో పాఠశాల మూతపడింది. ఇప్పటికైనా ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ స్కూళ్లలో నేటి పరిస్థితులకు అనువైన స్కిల్స్ ఉన్న ఉపాధ్యాయులను నియమించి మౌలిక వసతులు కల్పించాలి. ప్రభుత్వం మంత్రి సీతక్క ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

**ఎన్ రోల్ మెంట్ కార్యక్రమం చేపడతాం..**

**ఏటీడబ్ల్యూఓ అజయ్ కుమార్, ఐటీడీఏ ఏటూరునాగారం**

మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో విద్యా సంవత్సరం మొదట్లో ఎన్ రోల్ మెంట్ కార్యక్రమం చేపట్టి విద్యార్థుల సంఖ్యను పెంచినప్పటికీ తర్వాత జరిగిన పరిణామాలతో సంఖ్య తగ్గింది. ఉపాధ్యాయుల కొరత డిప్యూటేషన్ చేసినప్పటికీ విద్యార్థుల సంఖ్య పెరగలేదు. ఫలితంగా కొని పాఠశాలలకు మూతపడ్డాయి. దీంతో ఉపాధ్యాయులను డిప్యూటేషన్ చేశాము. విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై పే యూనిట్ ప్రధానోపాధ్యాయుల ఫిర్యాదుతో చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయుల కొరత ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ పాఠశాలల్లోని 3 నుంచి 5 తరగతి చదివే విద్యార్థులను కోమటిపల్లి, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి ఆశ్రమ పాఠశాలలకు తరలించాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

# రచ్చకెక్కిన విభేదాలు

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో నాయకుల మధ్య ఆధిపత్య పోరు పరాకాష్టకు చేరింది. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. పార్టీ వేదికగా జరిగిన గొడవలపై అధిష్టానం సీరియస్ అయి పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇద్దరు అగ్రనేతల విభేదాల వల్ల క్షేత్రస్థాయి క్యాడర్ తీవ్ర గందరగోళానికి గురవుతోంది. ప్రజా సమస్యలను వదిలేసి అంతర్గత కుమ్ములాటలతో కాలయాపన చేయడంపై విమర్శలు వస్తున్నాయి. గాంధీ భవన్ పెద్దలు జోక్యం చేసుకుని ఈ వివాదానికి ఎప్పుడు ముగింపు పలుకుతారోనని క్యాడర్ ఎదురుచూస్తోంది. జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా ప్రజాసమస్యలపై దృష్టి సారించాల్సిన సమ-యంలో నేతల మధ్య ఆధిపత్య పోరు రచ్చకెక్కడం కలకలం రేపుతోంది. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి మధ్య కొంతకాలంగా సాగుతున్న అంతర్గత యుద్ధం ఇప్పుడు బహిరంగ వివాదాలకు దారితీసింది. పార్టీ కార్యక్రమాలు, నియామకాలు, నిర్ణయాల్లో ఎవరి ప్రాబల్యం ఉండాలనే దానిపై నెలకొన్న విభేదాలు చివరకు షోకాజ్ నోటీసుల వరకు వెళ్లడంతో జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

**నేతల మధ్య ఆధిపత్య పోరు..**

డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ పార్టీ జిల్లా వ్యవహారాల్లో తన మార్కు చూపేందుకు ప్రయత్నిస్తుండగా, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కంది శ్రీనివాస్ రెడ్డి స్వతంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇద్దరి మధ్య సమన్వయం లోపించడమే కాకుండా, ఒకరి కార్యక్రమాలకు మరొకరు దూరంగా ఉండడం, అంతర్గత సమావేశాల్లో తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకోవడం వర్గపోరుకు బలం చేకూరుస్తోంది.

**షోకాజ్ నోటీసులతో షాక్..**

ఇటీవల పార్టీ వేదికలపై జరిగిన గొడవలు, శృతిమించిన వాగ్వాదాలపై అధిష్టానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన పలువురు నేతలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. షోకాజ్ నోటీసులకు నేతలు ఇచ్చే సమాధానం, అధిష్టానం తీసుకోబోయే తదుపరి చర్యలపై జిల్లా రాజకీయం ఉత్కంఠగా మారింది.

**క్యాడర్‌లో తీవ్ర గందరగోళం..**

ప్రధాన నాయకుల మధ్య విభేదాల ప్రభావం క్షేత్రస్థాయి కార్యకర్తలపై పడుతోంది. ఏ నాయకుడితో వెళ్తే ఏ ముద్ర పడుతుందోనని ద్వితీయ శ్రేణి నాయకులు ఆందోళన చెందుతున్నారు. అధికారంలో ఉండి కూడా ప్రజా సమస్యలను పక్కనపెట్టి నిత్యం కుమ్ములాటలతో కాలక్షేపం చేయడం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తుందని సీనియర్ నేతలు హెచ్చరిస్తున్నారు.

# విద్యార్థుల సమస్యలను పట్టించుకోట్లే




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరించి వారి గొంతును అణచివేసే ప్రయత్నం చేస్తోందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు తీవ్ర-స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, రాష్ట్రంలోని ఆయన 'గులాం'లు విద్యార్థుల ఆందోళనలను పెడచెవిన పెడుతున్నారని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్, ఆయుష్ విద్యార్థులతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థి లోకం పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ధర్నాలు, నిరసనలు చేస్తుంటే.. విద్యార్థులంటే ఏనాడూ ప్రాధాన్యత లేని కాంగ్రెస్ సర్కార్ వారి నిరసనల ప్రతిధ్వనిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న తనను పోలీసులు అక్రమంగా గృహనిర్బంధం చేయడాన్ని రాంచందర్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. హౌస్ అరెస్టులతో ప్రతిపక్షాల గొంతును నొక్కేయవచ్చని ప్రభుత్వం భావిస్తే అది వారి భ్రమే అవుతుందని, ఎలాంటి నిర్బంధాలు తమను అడ్డుకోలేవని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల సాధన పోరాటంలో బీజేపీ ఎల్లప్పుడూ వారికి వెన్నంటే నిలుస్తుందని స్పష్టం చేసిన ఆయన, వివాదాస్పదమైన జీవో నెంబర్ 97 ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే ఈ రోజు హైదరాబాద్ లో పాలిటెక్నిక్ విద్యార్థులు చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన ఎమ్మెల్యే



**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా వలిగొండకు చెందిన బత్తిని సహదేవ్ గౌడ్ ఉపాధ్యక్షులుగా శనిగారపు పాండు గంధమల్ల నరసింహ ప్రధాన కార్యదర్శిగా మామిడి సత్తిరెడ్డి దండెం సరిత గంగాపురం సాయిబాబా సూదిని రాజశేఖర్ రెడ్డి అదేవిధంగా కార్యదర్శులుగా బుగ్గ వెంకటేశం గంగాపురం సంధ్యారాణి కసర బోయిన నరసింహ బండారి అనిత కళ్లెం బాల శంకర్ గౌడ్ రేకల బాలరాజ్ గౌడ్ ప్రకటించగా ఎక్స్ క్యూట్ మెంబర్లుగా ఏర్పుల యాదయ్య ఎమ్మే నవ్య ఎడవెల్లి మల్లేశం జక్కల శోభ రాణి దండ మల్లికార్జున్ మాదాసు రాణి కేసరి మహేందర్ రెడ్డి కందుల నరేష్ కళ్లెం రాములు ను ప్రకటించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని సూచించారు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని అన్నారు రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని పేదలకు అందుతున్న ప్రతి పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు గత ప్రభుత్వం సాగునీటి కాలువల విషయంలో నిర్లక్ష్యం చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి కాలువలకు ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయలను నిధులు మంజూరు చేసి సాగునీరు అందించే ప్రక్రియను చేపట్టిందని అన్నారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గ నియామక పత్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సహదేవుకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసె రవివలిగొండ ముద్దాపురం గ్రామాల సర్పంచులు కుంభం వెంకట్ పాపిరెడ్డి సామ రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని లింగయ్య గంగాపురం సతీష్ రైతు సంఘం నాయకులు నరేందర్ రెడ్డిగౌడుగూడూరు శ్రీధర్ రెడ్డి కాసుల గుండు దానయ్య గౌడువెంకన్న గౌడ్ మత్స్యగిరి గుట్ట డైరెక్టర్ రాధారపు రమేష్ ఎమ్మే లింగస్వామి ఉలిపే మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం, జిల్లాలోని పాలకుర్తి మండలంలోని పీఎం శ్రీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులతో నేరుగా మాట్లాడి హిందీ, ఇంగ్లీష్, గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రం వంటి సబ్జెక్టుల్లో వారి అభ్యాస సామర్థ్యాన్ని పరీక్షించారు. బ్లాక్‌బోర్డుపై గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన అంశాలను స్వయంగా బోధిస్తూ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ఏకరూప దుస్తులు, నోట్ బుక్స్ అందాయా? పాఠ్యాంశాలు ఎంతవరకు పూర్తయ్యాయి? పాఠశాలలో అవసరమైన వసతులు ఉన్నాయా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు ప్రతి సబ్జెక్టును సులభంగా అర్థం చేసుకునే విధంగా బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు చెస్, వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడల్లో శిక్షణ అందించాలని పీఈటీని ఆదేశించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉన్న పాత బెంచీలను మరమ్మతులు చేసి అవసరమున్న ఇతర పాఠశాలలకు తరలించాలని, ఒక ప్రత్యేక గదిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. పాఠశాల భవనాలను పరిశీలించిన కలెక్టర్ తరగతి గదులకు సున్నం వేయించడం, దెబ్బతిన్న కిటికీల మరమ్మతులు, ఫ్యాన్లు లేని గదుల్లో కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటశాల పాతదిగా ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించి, వెంటనే ప్రతిపాదనలు సమర్పిస్తే నిధుల మంజూరును పరిశీలిస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. పాఠాలు చెప్పడానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, విలువలు, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పెంపొందించే దిశగా పని చేయాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, కష్టంగా అనిపించే సబ్జెక్టులపై అదనపు బోధన అందించాలని తెలిపారు. సాంఘిక శాస్త్ర బోధనకు అవసరమైన మ్యాపులను ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేయాలని, కంప్యూటర్ల వినియోగంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచి కోడింగ్ వంటి నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ బోర్డులు వంటి ఆధునిక సాంకేతిక వనరులను పాఠశాలలకు అందుబాటులోకి తెచ్చిందని, వాటిని సమర్థవంతంగా వినియోగించి, గుణాత్మక విద్య అందించాలని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలను తొలగించి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎంపీడీఓ వేదవతి, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, సర్పంచ్ కె. విజయ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# భూభారతి-22-ఏ నమోదుల్లో వ్యత్యాసాలను పోర్టల్‌లోనే పరిష్కరించాలి

**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** 22-ఏ కింద నమోదు అయిన వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపరచి, వివరాలు సమర్పించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం, హైదరాబాదు నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, సమగ్ర రీసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ మాట్లాడుతూ.. భూ భారతి డేటా ఆధారంగా ఎక్కడైనా 22-ఏ విస్తీర్ణంలో తేడాలు వస్తే వాటిని భూ భారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22-ఏ కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో తహసీల్దార్ల నుంచి సేకరించి, నివేదిక సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందుకోసం ప్రామాణిక కార్యాచరణ విధానం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్ఆర్ఓలో వచ్చిన ఫిర్యాదులను ఏ రోజుకు ఆరోజే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూముల రీ సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, వాటి సత్ఫలితాల ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ-సర్వే చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు 22-ఏలో నమోదు అయిన వాటిని గుర్తించి, వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రతి మండలంలోని ఒక గ్రామంలో భూముల రీ సర్వే నిర్వహించే విధంగా సర్వేయర్లను నియమించి, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, జీపీపీ, పీపీబీ, నాలా, తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ మన్యంకొండ, డీ - సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ మండల పరిధిలోని జతీరుప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు రక్షాబంధన్ వేడుకలు ప్రధానోపాధ్యాయులు బొలిశెట్టి బిక్షపతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య రక్షాబంధన్ యొక్క విశిష్టతను ప్రాధాన్యతను తెలిపారు. రక్షాబంధన్ అనేది కేవలం అన్నాచెల్లెళ్లకు, అక్కా తమ్ముళ్లకు సంబంధించిన విషయం కాదని రక్షణ కోసం ఒకరికొకరు కష్టసుఖాల్లో, బాధల్లో, ఆనందం లో సహాయ సహకారాలు అందించుకుంటూ ఒకరికొకరు రక్షణ గా ఉంటూ ఆ రక్షణ కుటుంబ రక్షణగా, గ్రామ రక్షణగా, దేశ రక్షణగా ఉండాలనే దృఢ సంకల్పమే రక్షాబంధన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎడవల్లి దామోదర్ రెడ్డి, ఒట్టే మాధవి, తుమ్మలూరి శ్రీనివాస్ రెడ్డి, ధీరావత్ జలరం, నారాయణ చంద్రకళ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**ములుగు, ఫ్లాష్ ఇండియా :** జిల్లాకు చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి పనిని సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కాని పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. గురువారం నూతన కలెక్టరేట్ సముదాయ సమావేశపు హాల్లో జిల్లా కలెక్టర్ బోర్కెడే హేమంత్ సహదేవురావు అధ్యక్షతన జిల్లా స్థాయి ఇంజనీరింగ్ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులను పూర్తి చేసే విషయంలో అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల వైఫల్యం స్పష్టంగా కనపడుతుందని అన్నారు. తాను ఇటీవల రెండు కార్యాలయాలను సందర్శించిన సమయంలో ఉద్యోగులు విధులకు గైరాహాజరైన విషయం గ్రహించానని ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గోదావరి జిల్లాలను ములుగు ప్రాంతానికి తరలించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి 2 వందల కోట్ల రూపాయలను మంజూరు చేశారని, ఆ నిధులతో రామప్ప, లక్నవరం, పొట్లాపూర్ వద్ద లిఫ్టు ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించడం జరుగుతుందని అన్నారు. రామప్పలో పూర్తిస్థాయిలో నీటిని నింపడం వలన రైతులు భూములు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని, అధికారులు భూములు కోల్పోతున్న రైతుల వివరాలను సేకరించి వారికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్ అ బి, పంచాయతీరాజ్, ఐటీడీఏ ఇంజనీరింగ్ సెక్షన్ల అధికారులు ప్రతి పనిపై దృష్టి సారించాలని రోడ్లు, భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, ఆర్టీవో డైరెక్టర్ వసంత రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దామరచర్ల మండలనూతన ఎంపీడీవోగా వెంకటయ్య బాధ్యతలు స్వీకరణ



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దామరచర్ల మండలం నూతన ఎం.పి.డి.ఓ గా వెంకటయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది వారికి హృదయపూర్వక స్వాగతం మరియు అభినందనలు తెలిపారు. కార్యాలయ సూపరింటెండెంట్, ఏ.పి.ఓ, ఎమ్.పి.ఓ. మరియు ఎమ్.పి.పి. సిబ్బంది తరపున శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమ పిడిఎస్ బియ్యం పట్టివేత నలుగురి అరెస్ట్



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా వీడియోస్ బియ్యం నిల్వ చేసి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన గురువారం జరిగింది. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవంతిపురం గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీ గణపతి ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్ మిల్ వద్ద అక్రమంగా పిడిఎస్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన నమ్మదగిన సమాచారం మేరకు, 26.08.2026 తేదీన సాయంత్రం సుమారు 4:30 గంటలకు పోలీసులు తనిఖీ నిర్వహించగా, ఇట్టి తనిఖీలో భాగముగా ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, రైస్ మిల్లుకు తరలించి నిల్వ చేసి, పాలిష్ చేయించి, ఇతర బస్తాల్లో ప్యాక్ చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 21 టన్నుల పిడిఎస్ బియ్యంను( 420 సంచులు ఒక్కొక్కటి 50 కేజీ ల బరువు కలవి), బియ్యం ను తరలించడానికి వాడే ఐసర్ మినీ డీసీఎం నెంబర్ టీఎస్ 05 యుఎఫ్ 6431ను కూడా స్వాధీనం చేసుకోవడం జరిగినదన్నారు.

ఈ కేసులో ఏ-01 సోమ రామకృష్ణ, ఏ-02 చిమ్మట వెంకన్న, ఏ-03 చిమ్మట లోకేష్ మరియు ఏ-04 సయ్యద్ నదీమ్లను అరెస్ట్ చేయడం రిగినదన్నారు. దర్యాప్తులో ఏ-01 వివిధ తెల్ల రేషన్ కార్డుదారుల వద్ద నుండి పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు, ఏ-02 మరియు ఏ-03 బియ్యాన్ని పాలిష్ చేసి రీప్యాకింగ్ చేయడంలో సహకరిస్తున్నట్లు, ఏ-04 డ్రైవర్‌గా బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు తెలిసినదన్నారు. హాఅదేవిధంగా ఏ-01పై గతంలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా/వ్యాపారానికి సంబంధించి 13 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైనట్లు దర్యాప్తులో తెలిసినదన్నారు. పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా ఇతర విధాలుగా దుర్వినియోగం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పత్రికా ముఖంగా తెలిపారు. ఈ అక్రమ వ్యాపారానికి సంబంధించిన ఇతర వ్యక్తుల పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

# వీర్లపల్లి శంకర్ మేనకోడలు వివాహానికి సీఎం రేవంత్



**శంషాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం శంషాబాద్ లోని మల్లికా గార్డెన్స్‌లో జరిగిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మేనకోడలు రాణి వివాహ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి, పలువురు ప్రముఖులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# అధికారుల కమిటీ పర్యటన



**మక్తల్,ఫ్లాష్ ఇండియా :** సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల ముంపు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గురువారం అడిషనల్ కలెక్టర్ శ్రీను ఆధ్వర్యంలోని ఐదుగురు సభ్యుల అధికారుల కమిటీ ముంపు గ్రామాల్లో పర్యటించి, బాధితుల అభిప్రాయాలు సేకరించింది. సంగంబండ రిజర్వాయర్ కింద నేరడుగం(మాగనూరు మండలం) గ్రామం నీటమునిగింది. భూత్పూర్ రిజర్వాయర్ కింద భూత్పూర్(మక్తల్ మండలం) గ్రామం ముంపునకు గురైంది. వర్షాకాలంలో ప్రాజెక్టుల్లోకి నీరు చేరినప్పుడు ఇళ్లలో నీటి ఊటలు పెరిగి, గోడలు నెర్రలు బారి కూలిపోయే ప్రమాదంలో ఉన్నాయి. వందలాది కుటుంబాలు తీవ్ర భయాందోళనల మధ్య నివాసముంటున్నారు. 2010లో జీవో 122 జారీ చేసినప్పటికీ, గత పాలకులు తమకేమీ పట్టినట్లు వ్యవహరించారని బాధితులు వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరి ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ప్రభుత్వం తక్షణ నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అడిషనల్ కలెక్టర్ శ్రీను, ఇరిగేషన్ ఎస్ఈ, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి, రెవెన్యూ ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, స్థానిక తహసీల్దార్ సతీష్ కుమార్ ఈ కమిటీలో ఉన్నారు. గ్రామాల్లో పర్యటించిన అధికారులు బాధితులతో మాట్లాడి వారి ఇబ్బందులు, నివాసాల ప్రస్తుత పరిస్థితి మరియు బాధిత కుటుంబాల సంఖ్య పై సమగ్ర వివరాలు సేకరించారు. త్వరలోనే ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేసి, బాధితులకు తగిన పునరావాసం కల్పిస్తామని అధికారులు తెలిపారు.



# రెండేళ్ల ఆధిపత్యానికి బ్రేక్

టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బౌలర్ జస్ప్రిత్ బుమ్రా ఆధిపత్యానికి బ్రేక్ పడింది. రెండేళ్లుగా నం.1 బౌలర్‌గా ఉన్న అతను ఇప్పుడు తన స్థానాన్ని గల్లంతు చేసుకున్నాడు. ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. ఐసీసీ బుధవారం టెస్టు ర్యాంకింగ్స్‌ను అప్‌డేట్ చేసింది. తాజా ర్యాంకింగ్స్‌లో బుమ్రా అగ్రస్థానాన్ని కాపాడుకోలేకపోయాడు. ఈ భారత పేసర్ కొంతకాలంగా టెస్టులు ఆడలేదు. అఫ్గానిస్తాన్‌తో ఏకైక టెస్టుకు దూరంగా ఉన్న అతను.. ప్రస్తుతం శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు కూడా గాయం కారణంగా అందుబాటులో లేడు. దీంతో బుమ్రా రెండో స్థానానికి పడిపోయాడు. ఇదే సమయంలో మిచెల్ స్టార్క్ టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో అతను 10 వికెట్లు పడగొట్టాడు. దీంతో తాజా ర్యాంకింగ్స్‌లో మ్యాట్ హెన్రీ, బుమ్రాలను వెనక్కినెట్టి స్టార్క్ నం.1 బౌలర్‌గా అవతరించాడు. స్టార్క్ తన 15 ఏళ్ల కెరీర్‌లో టెస్టుల్లో అగ్రస్థానం దక్కించుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. దీంతో రెండేళ్లుగా నం.1 బౌలర్‌గా కొనసాగుతున్న బుమ్రా హవాకు తెరపడినట్టైంది. బుమ్రా 2024లో తొలిసారిగా టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. అయితే, స్టార్క్(872), బుమ్రా(862) మధ్య కేవలం 10 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం మాత్రమే ఉంది. ఇతర భారత బౌలర్ల ర్యాంక్‌లు కూడా పతనమయ్యాయి. మహ్మద్ సిరాజ్ 4 స్థానాలు, జడేజా 3 స్థానాలు కోల్పోయి వరుసగా 18, 19 స్థానాలకు పడిపోయారు. కుల్దీప్ యాదవ్ 12 స్థానాలు కోల్పోయి 26వ స్థానంలో ఉన్నాడు. కానీ శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో ఆకట్టుకుంటున్న మరో స్పిన్నర్ మానవ్ సుతార్ తన ర్యాంక్‌ను భారీగా మెరుగుపర్చుకున్నాడు. ఏకంగా 28 స్థానాలు అధిగమించి 48వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. మరోవైపు, బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ టాప్-10లో చోటు సంపాదించాడు. శ్రీలంకతో సిరీస్‌తో రెండు హాఫ్ సెంచరీలు బాదిన అతను ఆరు స్థానాలు ఎగబాకి 7వ ర్యాంక్‌లో నిలిచాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా 7వ స్థానంలోనే ఉన్నాడు. యశస్వి జైశ్వాల్ రెండు స్థానాలు కోల్పోయి 11వ ర్యాంక్‌కు పడిపోయాడు. కేఎల్ రాహుల్ 5 స్థానాలు వెనక్కినెట్టి 30వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా నం.1గా కొనసాగుతున్నాడు.

# పాకిస్థాన్ సంస్థకు కీలక హక్కులు!



భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య వచ్చే నెల నుంచి జరగనున్న మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ క్రికెట్ ప్రపంచంలో ఒక అరుదైన ఘట్టానికి వేదిక కాబోతోంది. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా ఒక జట్టు (భారత్) తన సొంత గడ్డపైనే 'అతిథి' (గెస్ట్)గా ఆడనుండగా, అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఈ సిరీస్‌కు ఆతిథ్యమివ్వనుంది. అయితే, సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కావాల్సిన ఈ సిరీస్ మ్యాచ్‌లు ప్రారంభం కాకముందే తీవ్ర వివాదంలో చిక్కుకున్నాయి. ఈ టీ20 సిరీస్‌కు సంబంధించిన కమర్షియల్, టీవీ ప్రొడక్షన్ హక్కులను అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు 'ట్రాన్స్‌గ్రూప్' అనే పాకిస్థానీ సంస్థకు అప్పగించడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. ఈ సంస్థ పాకిస్థాన్ సూపర్ లీగ్ , పాకిస్థాన్ క్రికెట్ బోర్డు లతో చాలా కాలంగా దగ్గరి సంబంధాలు కలిగి ఉంది. ఆగస్టు 12న ఈ సిరీస్ షెడ్యూల్‌ను విడుదల చేసిన సందర్భంలో అఫ్గానిస్థాన్ బోర్డు తమ భాగస్వాముల వివరాలను అధికారికంగా వెల్లడించింది. దీని ప్రకారం.. 'వాణి' సంస్థ ACB క్లోథింగ్ పార్ట్‌నర్‌గా కొనసాగనుండగా, 'ట్రాన్స్‌గ్రూప్' గ్లోబల్ మీడియా రైట్స్ సిండికేషన్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తుంది. అలాగే 'TPT360' మీడియా ప్రొడక్షన్ పార్ట్‌నర్‌గా, భారత్‌లో ప్రసారాల కోసం 'ఫ్యాన్‌కోడ్' ఆఫీషియల్ స్ట్రీమింగ్ పార్ట్‌నర్‌గా ఉంటాయి. గత కొన్నేళ్లుగా అఫ్గానిస్థాన్ తన హోమ్ మ్యాచ్‌లను విదేశీ మైదానాల్లోనే ఆడుతున్న సంగతి తెలిసిందే. మన దేశంలోని లక్నో, డెహ్రాడూన్, గ్రేటర్ నోయిడాతో పాటు యూఏఈ కూడా అఫ్గానిస్థాన్‌కు హోమ్ గ్రౌండ్స్‌గా వ్యవహరించాయి. అందువల్లే భారత్‌లో మ్యాచ్‌లు జరుగుతున్నా, అఫ్గానిస్థాన్ ఇక్కడ ఆతిథ్య జట్టుగా నిలుస్తోంది. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లకు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదిక కానుంది. సెప్టెంబర్ 13న తొలి టీ20, 15న రెండో టీ20, 17న మూడో టీ20 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ ఏడాది జూన్‌లోనే అఫ్గానిస్థాన్ జట్టు భారత్‌లో పర్యటించి ఒక టెస్టు, మూడు వన్డేల సిరీస్ ఆడింది. ధర్మశాల, లక్నో, చెన్నైలలో జరిగిన వన్డేల్లో విజయం సాధించడంతో పాటు ముల్లాంపూర్‌లో జరిగిన ఏకైక టెస్టులోనూ టీమిండియా అఫ్గాన్‌పై ఘన విజయం సాధించింది.



# విరాట్ కోహ్లితో వివాదం గుర్తుందా?

దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్, స్టార్ టెస్టు ఓపెనర్ డీన్ ఎల్గర్ ప్రొఫెషనల్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నాడు. 2024లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఎల్గర్.. ఆ తర్వాత దేశవాళీ, కౌంటీ క్రికెట్‌లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న 2026 కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్ ముగిసిన తర్వాత పూర్తిగా ఆట నుంచి తప్పుకోనున్నట్లు ప్రకటించాడు. 39 ఏళ్ల ఎల్గర్ తన రిటైర్మెంట్‌పై స్పందిస్తూ.. ఇదే సరైన సమయం అని భావిస్తున్నట్లు తెలిపాడు. క్రికెట్ కెరీర్‌లో ఇక ముందుకు సాగడం కంటే కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలని, తన భాగస్వామి, పిల్లలతో ఉండటం ప్రస్తుతం తనకు ముఖ్యమని చెప్పాడు. 'నేను రిటైర్మెంట్ తీసుకోవడానికి ఇదే సరైన సమయం అనిపిస్తోంది. నాకు 39 ఏళ్లు వచ్చాయి. ఇంటి వద్ద ఎదుగుతున్న నా పిల్లలతో పాటు కుటుంబానికి సమయం కేటాయించాల్సిన అవసరం ఉంది. నా భాగస్వామి, పిల్లలతో కలిసి ఉండాలని అనుకుంటున్నాను. నా క్రికెట్ ప్రయాణం అద్భుతంగా సాగింది. అయితే ఇది ఇంకా పూర్తికాలేదు. కౌంటీ ఛాంపియన్‌షిప్ ఈ సీజన్ ముగిసిన తర్వాత నేను రిటైర్ అవుతాను' అని ఎల్గర్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికా తరఫున ఎల్గర్ 12 సంవత్సరాల పాటు అంతర్జాతీయ క్రికెట్ ఆడాడు. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లో జట్టుకు నమ్మకమైన ఓపెనర్లలో ఒకడిగా నిలిచాడు. 86 టెస్టుల్లో 5,347 పరుగులు చేసిన ఎల్గర్.. 37.92 సగటుతో రన్స్ చేశాడు. అతడి ఖాతాలో 14 సెంచరీలు ఉన్నాయి. 2017లో బంగ్లాదేశ్‌పై చేసిన 199 పరుగులు అతడి కెరీర్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు. దక్షిణాఫ్రికా టెస్టు కెప్టెన్‌గా కూడా ఎల్గర్ బాధ్యతలు నిర్వహించాడు. 2022లో ఇంగ్లండ్‌పై లార్డ్స్ వేదికగా దక్షిణాఫ్రికా సాధించిన టెస్టు విజయం అతడి కెరీర్‌లో అత్యంత ప్రత్యేకమైన ఘట్టాల్లో ఒకటి. కెప్టెన్‌గా ఉన్న సమయంలో లార్డ్స్‌లో ఇంగ్లండ్‌ను ఓడించడం ఎంతో గర్వంగా భావిస్తున్నానని ఎల్గర్ చెప్పాడు. తాను కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టే సమయానికి దక్షిణాఫ్రికా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానంలో ఉందని, తన పదవీకాలం ముగిసే సమయానికి రెండో స్థానానికి చేరుకుందని డీన్ ఎల్గర్ గుర్తు చేసుకున్నాడు. తనకు క్రికెట్‌లో ఛాన్స్ వస్తుందని చాలామంది ఊహించలేదని, రెండు దశాబ్దాలకు పైగా ఆటను కొనసాగించడం తనకు ప్రత్యేకమైన అనుభవమని పేర్కొన్నాడు. ఇక ఎల్గర్ పేరు భారత క్రికెట్ అభిమానులకు మరో కారణంతోనూ గుర్తుండిపోతుంది. 2022లో భారత్-దక్షిణాఫ్రికా టెస్టు సందర్భంగా డీఆర్ఎస్ నిర్ణయం విషయంలో ఎల్గర్, అప్పటి భారత కెప్టెన్ విరాట్ కోహ్లి మధ్య జరిగిన ఉద్రిక్తత చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది.

# బిజినెస్



# తగ్గిన బంగారం ధర..

రాఖీ పౌర్ణమి వేళ బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి స్వల్ప ఊరట లభించింది. గురువారం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు తగ్గాయి. శుక్రవారం రాఖీ పౌర్ణమి ఉండటంతో పండుగ సందర్భంగా బంగారం కొనుగోళ్లకు డిమాండ్ ఉండే అవకాశం ఉంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో గురువారం మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.770 తగ్గింది. దీంతో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,62,980కి చేరింది. అదేవిధంగా 22 క్యారెట్ల బంగారం ధర కూడా తగ్గింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.700 మేర తగ్గడంతో ప్రస్తుతం రూ.1,49,400గా ఉంది. వెండి ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,65,000 వద్ద కొనసాగుతోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా బంగారం, వెండి కొనుగోళ్లకు సాధారణంగా డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో పండుగకు ఒక రోజు ముందు ధరలు స్వల్పంగా తగ్గడం కొనుగోలుదారులకు కొంత ఊరటనిచ్చింది. అయితే అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, దేశీయ డిమాండ్, రూపాయి మారకం విలువ వంటి అంశాల ఆధారంగా బంగారం ధరల్లో మళ్లీ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది.




# జుకర్‌బర్గ్ సీక్రెట్ ప్లాన్..

మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కంపెనీని పూర్తిగా ఏఐ ఆధారిత సంస్థగా మార్చేందుకు భారీ ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఇందులో భాగంగా కొన్ని విభాగాల్లో ఏకంగా 60 శాతం వరకు ఉద్యోగాలను తగ్గించి, ఆ పనులను ఏఐ ఏజెంట్లతో చేయించాలని భావించినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఈ ప్లాన్ ఉద్యోగుల నుంచి వ్యతిరేకత రావడం, ఏఐ వైఫల్యాలతో తలకిందులైనట్లు తెలుస్తోంది. పలు నివేదికల ప్రకారం.. ఈ ఏడాది జనవరిలో హవాయిలోని జుకర్‌బర్గ్ నివాసంలో ఉన్నతాధికారులతో జరిగిన రహస్య సమావేశంలో 'ప్రాజెక్ట్ OT' (ఆర్గనైజేషన్ ట్రాన్స్‌ఫర్మేషన్)కు రూపకల్పన చేసినట్లు సమాచారం. మెటాను 'ఏఐ నేటివ్' కంపెనీగా మార్చడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని టీమ్‌లలో 60 శాతం వరకు ఉద్యోగాలను తగ్గించి, మిగిలిన వారితో ఏఐ ఏజెంట్లను పర్యవేక్షించాలని భావించినట్లు సమాచారం. పాత మేనేజర్ పోస్టులను తొలగించి 'టెక్ పాడ్స్' ఏర్పాటు చేసే ప్రక్రియ కూడా ప్రారంభమైనట్లు ఈ నివేదిక వెల్లడించింది.

**మౌస్, కీబోర్డ్ ట్రాకింగ్‌తో ఉద్యోగుల్లో ఆగ్రహం**

మార్చిలో ఈ ప్రణాళికకు సంబంధించిన సమాచారం బయటకు రావడంతో మెటాలో కలకలం మొదలైనట్లు తెలుస్తోంది. అమెరికాలోని ఉద్యోగుల కంప్యూటర్లలో మౌస్ క్లిక్స్, కీబోర్డ్ కార్యకలాపాలను ట్రాక్ చేసే సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేయడం మరింత వివాదానికి దారితీసిందని సమాచారం. తమ స్థానాలను భర్తీ చేయబోయే ఏఐ కి తామే శిక్షణ ఇస్తున్నామంటూ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. దీంతో కంపెనీలో పని చేసే ఉద్యోగుల్లో పని చేయాలనే ఉత్సాహం గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. మరోవైపు జుకర్‌బర్గ్ భారీగా ఆధారపడిన ఏఐ వ్యవస్థలు కూడా ఆశించిన స్థాయిలో పనిచేయలేదని తెలుస్తోంది. ఏఐ వినియోగంతో కోడింగ్ వేగం 220 శాతం పెరిగినా.. వినియోగదారులకు చేరిన కొత్త ఫీచర్లు కేవలం 36 శాతం మాత్రమే పెరిగినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఏఐ ఏజెంట్ల కారణంగా సాంకేతిక సమస్యలు పెరిగాయని, గత ఏడాదితో పోలిస్తే టెక్నికల్, సెక్యూరిటీ ఘటనలు 40 శాతం పెరిగినట్లు తెలిపింది.

**చివరి నిమిషంలో భారీ ప్లాన్‌కు బ్రేక్**

ఈ పరిణామాల నేపథ్యంలో జుకర్‌బర్గ్ తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు సమాచారం. మే 19న తొలి దశ ఉద్యోగాల కోతకు కొన్ని గంటల ముందు అత్యవసర సమావేశం నిర్వహించి, నవంబర్‌లో చేపట్టాల్సిన రెండో దశ భారీ తొలగింపులను రద్దు చేసినట్లు నివేదిక పేర్కొంది. మే 20న సుమారు 10 శాతం ఉద్యోగులను మాత్రమే తొలగించినట్లు సమాచారం. ఆ తర్వాత ఈ ఏడాది మరో భారీ ఉద్యోగాల కోత ఉండదని జుకర్‌బర్గ్ ప్రకటించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉద్యోగుల కంప్యూటర్లపై మౌస్ ట్రాకింగ్‌ను నిలిపివేసినట్లు సమాచారం. అయితే ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో జుకర్‌బర్గ్‌పై పెట్టుబడిదారుల ఒత్తిడి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# భారత్‌లో మ్యాక్‌బుక్, ఐప్యాడ్




ఐఫోన్‌ల తయారీకి ఇప్పటికే కీలక కేంద్రంగా మారుతున్న భారత్‌ను యాపిల్ మరింత పెద్ద తయారీ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం కోరుతోంది. అయితే ఐప్యాడ్‌లు, మ్యాక్‌బుక్‌లు, యాపిల్ వాచ్‌ల వంటి ఉత్పత్తుల పూర్తి స్థాయి తయారీకి ముందు దేశంలో స్థానిక విడిభాగాల సరఫరా వ్యవస్థను నిర్మించాలని యాపిల్‌పై ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత్‌లో తయారవుతున్న ఐఫోన్‌లు, ఎయిర్‌ప్యాడ్‌లకే కాకుండా, ఇతర దేశాల్లోని యాపిల్ తయారీ కేంద్రాలకు ఎగుమతి చేయడానికి కూడా భారత్‌లో తయారైన విడిభాగాలను ఉపయోగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీంతో యాపిల్ ప్రపంచ సరఫరా గొలుసులో భారత్ పాత్ర మరింత పెరగనుంది. ఇప్పటికే భారత కంపెనీలు పీసీబీల అసెంబ్లీలు, ఫ్లెక్సిబుల్ పీసీబీలు, మెటల్ ఎన్‌క్లోజర్లు, ఇతర యాంత్రిక భాగాలు, హౌసింగ్‌లు, గ్రాఫైట్ భాగాలు, వైర్లు, ప్యాకేజింగ్ మెటీరియల్స్ వంటి వాటిని తయారు చేస్తున్నాయి. వీటిలో కొన్ని భాగాలు ఇప్పటికే భారత్ నుంచి చైనా, వియత్నాం వంటి యాపిల్ తయారీ కేంద్రాలకు ఎగుమతి అవుతున్నాయి. భారత్‌లో విడిభాగాల తయారీ సామర్థ్యం పెరిగితే, యాపిల్ ఇతర ఉత్పత్తుల అసెంబ్లీ, తయారీని కూడా క్రమంగా ఇక్కడికి తీసుకురావచ్చన్నది ప్రభుత్వ అంచనా.



# గ్యాస్ సిలిండర్ ధరలు

ఈ నెల(ఆగస్టు) 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించిన విషయం తెలిసిందే. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(గురువారం) ఆగస్టు 27 వ తేది రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**తెలంగాణ**

హైదరాబాద్ : రూ.994.00
వరంగల్ : రూ.1013.00

**ఆంధ్రప్రదేశ్**

విశాఖపట్నం : రూ.950.00
విజయవాడ : రూ.966.50
గుంటూరు : రూ.966.50

# 'మండాడి' టీజర్ చూశారా?




తాజాగా విడుదలైన 'మండాడి' టీజర్ ఈ చిత్రంపై అంచనాలను మరింత పెంచేసింది. టీజర్‌లోని డైలాగ్స్, విజువల్స్, బోట్ సీక్వెన్స్, పడవ పందేలకు సంబంధించిన సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'పందెమే మనల్ని కాపాడుతుంది.. పందెన్ని మనం కాపాడటం లేదు', 'బరిలోకి దిగే ప్లేయర్స్‌లో నిజాయితీ ఉంటే.. ఈ గాలి, సముద్రం మిమ్మల్ని ఎప్పటికీ ఒగ్గేయదు' వంటి డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి.ఎస్.ఆర్. కథిర్ సినిమాటోగ్రఫీ కూడా టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. టీజర్‌లో యాక్షన్, ఎమోషన్, డ్రామా, విజువల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వడంతో 'మండాడి'పై అంచనాలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. పడవ పందేల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. కాగా 'మండాడి' సెప్టెంబర్ 10న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఏపీ, తెలంగాణలో ఈ సినిమాను మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ భారీ స్థాయిలో విడుదల చేయనుంది. తాజా టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# రామ్ భారీగానే ప్లాన్ చేశాడుగా



టాలీవుడ్ యువ నటుడు రామ్ పోతినేని ప్రస్తుతం 'రాపో23' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న సినిమాలో హీరోగా నటిస్తూ, దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ సినిమాకు శ్యామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్ ఎవరు అనేది ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయితే ప్రస్తుతానికి సంయుక్త మీనన్, శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ బృందం చిత్రానికి రెండు టైటిల్స్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది.ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం రామ్ పోతినేని 23వ చిత్రానికి ఆసక్తికరమైన టైటిల్‌లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు 'ఏక' అనే టైటిల్‌ను ఖరారు చేసి, దానికి 'ది లోన్ వుల్ఫ్' అనే క్యాప్షన్‌ను జోడించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అదే సమయంలో కేవలం 'ది లోన్ వుల్ఫ్' అనే టైటిల్‌తోనే సినిమాను విడుదల చేస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని కూడా మేకర్స్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ రెండింటిలో ఏదైనా ఒక టైటిల్‌ను చిత్ర బృందం ఖరారు చేస్తుందా? లేక మరో కొత్త టైటిల్‌ను ఫిక్స్ చేస్తుందా? అనేది చూడాలి.

యంగ్ బ్యూటీ శోభిత ధూళిపాళ, అక్కినేని నాగచైతన్యతో పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే.. ఇటీవల సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన ఈ హీరోయిన్ అడపదడప సినిమాలు అనౌన్స్ చేస్తూ సందడి చేస్తుంది. అయితే.. సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉండే శోభిత.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన పలు ఆసక్తిర విషయాలు పంచుకుంది. 'అలాంటి రోజు వస్తుందని అనుకోలేదు. పెళ్ళైన వెంటనే నేను సినిమా షూటింగ్ కోసం నేను తమిళనాడు వెళ్లాల్సి వచ్చింది. కేవలం నెలకొకసారి మాత్రమే చైతును కలిసేదాన్ని.. ఇద్దరం సినిమా ఫీల్డ్‌లో ఉండటం వల్ల పెళ్లి తర్వాత లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం కష్టంగా మారింది. అయితే కొన్ని నెలలకే కొత్త జీవితానికి అలవాటు పడిపోయాం.. మా వైవాహిక బంధాన్ని మరింత బలంగా మార్చుకున్నాం. అంతే కాదు.. చిన్నతనం నుంచి నా పెళ్లిపై నాకు ఎన్నో ఎక్స్‌పెక్టేషన్స్ ఉండేవి. మ్యారేజ్ చాలా గ్రాండ్‌గా చేసుకోవాలని ఎన్నో కలలు కనేదాన్ని. అయితే ఈ రాష్ట్రం అబ్బాయిని కాకుండా వేరే రాష్ట్రం అబ్బాయిని పెళ్లి చేసుకోవాలనుకున్నా.. అలాగే ఓ హీరోని పెళ్లి చేసుకుంటా అని అస్సలు ఎక్స్‌పెక్ట్ చేయలేదు. కానీ అదృష్టం నా లైఫ్‌లోకి చైతు వచ్చాడు' అంటూ ఆనందం వ్యక్తం చేసింది శోభిత.

# పెళ్లి తర్వాత లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం







# రష్మికతో కలిసి విజయ్ విశ్వరూపం..

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'పై ప్రేక్షకుల్లో రోజురోజుకు ఆసక్తి పెరుగుతోంది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 2026 అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా 'రణబాలి'ని గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. "మన చరిత్రలోని అత్యంత చీకటి అధ్యాయం ఈ అక్టోబర్‌లో తెరుచుకోబోతోంది" అంటూ తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్‌ను ప్రకటించడం సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచింది. దీంతో ఈ చిత్రం ఎలాంటి కథతో తెరకెక్కుతోంది? చరిత్రలోని ఏ సంఘటనను తెరపై ఆవిష్కరించబోతున్నారు? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.దర్శకుడు రాహుల్ సంకృత్యన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నతో పాటు హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్రలో నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. గతంలో 'శ్యామ్ సింగ రాయ్'తో తనదైన మేకింగ్‌ను చూపించిన డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ .. 'రణబాలి'తో మరింత భారీ కాన్వాస్‌ను ఆవిష్కరించబోతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం అందిస్తుండగా.. నీరవ్ షా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యాక్షన్ కొరియోగ్రఫీ కోసం యానిక్ బెన్, ఆండీ లాంగ్ న్గుయెన్ వంటి అంతర్జాతీయ స్టంట్ నిపుణులు భాగమయ్యారు. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు ఉండగా.. 'రణబాలి' అక్టోబర్ 16, 2026న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలియడంతో ఈ చిత్రంపై విజయ్ దేవరకొండ, రష్మిక అభిమానుల్లో మరింత హైప్ పెరిగింది.

# కథ నచ్చితే దేనికైనా రెడీ..

టాలీవుడ్ యంగ్ బ్యూటీ ప్రియా భవానీ శంకర్ ఇటీవల 'ఇరుముడి' చిత్రంతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సినిమాలో మాస్ మహారాజా రవితేజ సరసన భార్యగా, ఒక పాపకు తల్లిగా కనిపించి తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. ఈ సినిమా మంచి విజయం సాధించిన సందర్భంగా, రీసెంట్ ఇంటర్వ్యూలో తన పాత్ర, కెరీర్ నిర్ణయాలపై ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తెరపై ఒక బిడ్డకు తల్లిగా నటించడానికి తనకు ఎటువంటి అభ్యంతరం లేదని ప్రియా భవానీ శంకర్ స్పష్టం చేశారు. ఒకవేళ తనకి ఇరవై ఏళ్ల వయసులోనే వివాహం జరిగి ఉంటే, ఈపాటికి నిజ జీవితంలోనూ ఒక పాప లేదా బాబు ఉండేవారని, అందువల్ల ఇలాంటి పాత్రలు చేయడానికి వెనుకాడాల్సిన అవసరం లేదని అన్నారు. ఒక నటిగా తనకు పాత్ర కంటే కూడా ఆ కథ ఎంత బలంగా ఉందో చూసుకోవడమే ముఖ్యమని చెప్పారు. కాబట్టి కథ నచ్చితే ఏం చేయడానికైనా రెడీగా ఉంటానని స్పష్టం చేశారు.ఇక 'ఇరుముడి' గురించి మాట్లాడుతూ.. దర్శకుడు మొదటిసారి 'ఇరుముడి' కథను వివరించినప్పుడు, అది ఎంతో భావోద్వేగంగా, మనసును హత్తుకునేలా అనిపించిందని గుర్తు చేసుకున్నారు. కాగితంపై చదివిన ఆ ఎమోషన్ అదే రీతిలో వెండితెరపైకి వస్తుందా లేదా అన్న ఒకే ఒక్క సందేహం తనలో ఉండేదని, కానీ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధించి ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవ్వడంతో ఆందోళన తొలగిపోయిందని తెలిపారు. ఈ రోజుల్లో చాలామంది హీరోయిన్లు చిన్న వయసులోనే తల్లి పాత్రల్లో నటించేందుకు ఇష్టపడకపోవడం కామన్. అయితే ప్రియా భవానీ శంకర్ మాత్రం పాత్ర స్వభావాన్ని, కథలోని ప్రాధాన్యతను బట్టి ముందడుగు వేయడం అందరినీ ఫిదా అయ్యేలా చేసింది. ఈ విషయంపై ఆమెను ప్రశంసిస్తున్నారు.






# నేను రాసింది ఒకటి.. తీసింది మరొకటి..

లేడీ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ రూపొందించిన లేటెస్ట్ మూవీ 'టాక్సిక్'. కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటించిన ఈ మూవీ భారీ అంచనాల మధ్య ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు వచ్చి యాక్షన్ ప్రియులను ఆకర్షిస్తోంది. అలాగే.. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో కొన్ని భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి సమయంలో డైరెక్టర్ గీతూ మోహన్ దాస్‌కు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్ అవుతూ సంచలనంగా మారింది.టాక్సిక్ చిత్రీకరణ ప్రారంభించే ముందు గీతూ మోహన్ దాప్ తన చిత్ర నిర్మాణ శైలి గురించి మాట్లాడుతూ.. 'నేను రాసేది ఒకటి, చిత్రీకరించేది మరొకటి, ఎడిట్ చేసేది ఇంకొకటి. కానీ సినిమా పూర్తయి విడుదలయ్యాక మాత్రం నాకు సంతోషంగా ఉంటుంది. నేను ఎప్పుడూ స్క్రిప్ట్‌కు కట్టుబడి ఉండను. 'స్క్రిప్ట్‌లో మీరు చదివినది యథాతథంగా తెరపై రాకపోవచ్చు' అని నేను ఎప్పుడూ నిర్మాతలకు చెబుతుంటాను' అంటూ చెప్పుకొచ్చింది. సినిమా తయారీ ప్రక్రియను నమ్ముతూ, ఆ సినిమా తనను ఎక్కడికి నడిపిస్తే అక్కడికి వెళ్తాను అంటూ గీతూ చేసిన ఈ కామెంట్స్ ప్రజెంట్ హాట్ టాపిక్‌గా వైరల్ అవుతున్నాయి.

# 'ఎన్‌బీకే111' కోసం బాలయ్య రెడీ




నందమూరి నటసింహం బాలకృష్ణ ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నారు. ఈ మూవీకి టైటిల్ ఇంకా ఖరారు కాకపోవడంతో 'ఎన్‌బీకే111' వర్కింగ్ టైటిల్‌తో సినిమాను పూర్తి చేస్తూ వస్తున్నారు. ఈ చిత్రానికి 'దాదా' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లోనే దీనిని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. ఈ శుక్రవారం నుంచి బాలకృష్ణ ఈ సినిమా ఫస్ట్ హాఫ్ డబ్బింగ్ పనులను ప్రారంభించబోతున్నట్లు తెలుస్తోంది.అలాగే అక్టోబర్ 5వ తేదీ నుంచి తదుపరి షెడ్యూల్‌ను మైసూరులో ప్రారంభించబోతున్నట్లు సమాచారం. ఈ మూవీని ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అందుకు అనుగుణంగానే షూటింగ్, మిగతా పనులను పక్కా ప్రణాళికతో పూర్తి చేస్తూ వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**